విలేకరులు కావలెను
పెన్ సత్తా తెలుగు దినపత్రిక
ఆంధ్రప్రదేశ్ అన్ని జిల్లా లకి పెన్ సత్తా దినపత్రికలో పనిచేయుటకు జిల్లా స్టాఫ్ రిపోర్టర్లు, నియోజకవర్గ ఇంచార్జ్ లు, మండల రిపోర్టర్లు కావలెను. వార్తలు పెట్టే వారికే ప్రాధాన్యత.
ఫోన్ నెం : 9885315759

RNI:APTEL/2023/87729

# పెన్ సత్తా

PEN SATTA Telugu Daily

ప్రశ్నించడం అందిరి హక్కు...



సంపుటి : 3 సంచిక : 323 ఎడిటర్ : చింతమనేని అనిల్ కుమార్ బుధవారం 15 ఏప్రిల్ 2026 పేజీలు : 08 వెల : 03

Published from Vishakapatnam Circulated by Vijayawada, Ongole, Chittoor, Kadapa, Tirupati. Nandyal, Hyderabad, Ananthapur, Kurnool

# క్వాంటమ్ కంప్యూటర్.. మేడిన్ అమరావతి

ఐబీఎం నుంచి వచ్చేసరికల్లా తయారుచేయాలి

క్వాంటమ్ టెక్నాలజీలో ఇక స్వావలంబన

ఐటీకి సిలికాన్ వ్యాలీ... ఇకపై క్వాంటమ్‌కు అమరావతి

లక్ష్యం నిర్దేశించిన సీఎం చంద్రబాబు

ఎస్ఆర్ఎం యూనివర్సిటీ, మేధా టవర్స్‌లో క్వాంటమ్ రిఫరెన్స్ ఫెసిలిటీస్ ప్రారంభం





: ఐబీఎం సంస్థ వచ్చే డిసెంబరులో అమరావతిలో క్వాంటమ్ కంప్యూటర్ ఏర్పాటుచేసే నాటికి.. అలాంటి కంప్యూటర్‌నే పూర్తి దేశీయ పరిజ్ఞానంతో ఇక్కడే తయారుచేయాలని అమరావతి క్వాంటమ్ మిషన్ ప్రతినిధులు, శాస్త్రవేత్తలకు ముఖ్యమంత్రి చంద్రబాబు లక్ష్యం నిర్దేశించారు. క్వాంటమ్ పరిశోధనలకు నిధుల

వివరాలు 2లో..



## బిహార్ కొత్త ముఖ్యమంత్రిగా సమ్రాట్ చౌధరీ

- బీజేపీ తొలి సీఎంగా రికార్డ్
- బిహార్‌లో బీజేపీ శాసనసభా పక్ష నేతగా ఎంపికైన సమ్రాట్ చౌధరీ
- నూతన ముఖ్యమంత్రిగా బాధ్యతలు
- బుధవారం లోక్‌భవన్‌లో సీఎంగా బాధ్యతలు చేపట్టనున్నట్లుగా సమాచారం.

వివరాలు 2లో..



## సమాజం బాగు కోసమే రెడ్‌బుక్

రాజారెడ్డి రాజ్యాంగంతో జగన్ విధ్వంసం

వైకాపా ఫేక్ ప్రచారాలను తిప్పికొట్టండి

పార్టీ క్లస్టర్ ఇన్‌ఛార్జులతో మంత్రి నారా లోకేశ్

: రాజారెడ్డి రాజ్యాంగంతో జరిగిన విధ్వంసం నుంచి సమాజాన్ని బాగు చేసేందుకే రెడ్‌బుక్ వచ్చిందని విద్య, ఐటీ శాఖల మంత్రి, తెదేపా ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ తెలిపారు. మంగళగిరిలోని తెదేపా కేంద్ర కార్యాలయంలో పార్టీ క్లస్టర్ ఇన్‌ఛార్జుల శిక్షణ తరగతుల్లో భాగంగా నిర్వహించిన 'కాఫీ కబుర్లు' సెషన్‌లో మంత్రి మాట్లాడారు.

వివరాలు 2లో..



## ఛత్తీస్‌గఢ్ పవర్‌ప్లాంట్‌లో బాయిలర్ పేలుడు..

- 10 మంది మృతి.. 40 మందికి గాయాలు
- ప్రమాద స్థలంలో శిథిలాల కింద మరికొందరు కార్మికులు చిక్కుకుని ఉన్నట్లు అనుమానం
- ఈ ఘటనపై దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన ఛత్తీస్‌గఢ్ సీఎం విష్ణుదేవ్ సాయ్

వివరాలు 2లో..

## రాజ్యాంగాన్ని బీజేపీ, ఆరెస్సెస్ ఆలోచనలు ధ్వంసం చేస్తున్నాయి



- కాషాయ పార్టీ ఓట్ల దొంగతనానికి పాల్పడుతోంది
- బీజేపీ ప్రజాస్వామ్యాన్ని నాశనం చేస్తోంది
- బంగాల్‌లో బీజేపీ ఓటు చోరీ చేసేందుకు మమతా ప్రభుత్వమే అవకాశం ఇచ్చింది
- రాహుల్ గాంధీ ఆరోపణలు

వివరాలు 2లో..

## తెలంగాణలో నిప్పుల వర్షం



ఆ జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్.. రాష్ట్రంలో మండుతున్న ఎండలు

ఉదయం 9 గంటల నుంచే భానుడి భగభగలు

రాష్ట్రంలో 42 డిగ్రీలకు పైగా నమోదవుతున్న గరిష్ఠ ఉష్ణోగ్రతలు

పలు జిల్లాలకు ఆరెంజ్ హెచ్చరికలు జారీ

హైదరాబాద్

తెలంగాణ రాష్ట్రంలో ఎండల తీవ్రత కొనసాగుతోంది. పగటి పూట ఉష్ణోగ్రతలు రోజురోజుకూ పెరగుతున్నాయి. ఉదయం 9 గంటల నుంచే భానుడు నిప్పులు కురిపిస్తున్నారు. రాష్ట్రంలో గరిష్ఠ ఉష్ణోగ్రతలు 42 డిగ్రీలకు పైగా నమోదవుతున్నాయి. నిన్న ఉమ్మడి నిజామాబాద్‌లో 42.4, ఆదిలాబాద్‌లో 42.3 ఉష్ణోగ్రతలు, ఉమ్మడి మహబూబ్‌నగర్‌లో 41, ఖమ్మంలో 40.4 ఉష్ణోగ్రతలు, హైదరాబాద్‌లో 40.1 గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఒకవైపు ఎండ తీవ్రత మరోవైపు ఉక్కపోతతో జనం అల్లాడిపోతున్నారు. ఇవాళ ఉమ్మడి ఆదిలాబాద్, మహబూబ్‌నగర్, నిజామాబాద్, జగిత్యాల, సిరిసిల్ల, హైదరాబాద్ జిల్లాలకు వాతావరణశాఖ అధికారులు

వివరాలు 2లో..



## 850కి లోక్‌సభ స్థానాలు

- డీలిమిటేషన్ కమిషన్ ఏర్పాటు
- మహిళా రిజర్వేషన్ల అమలుకు కేంద్రం సిద్ధం
- దేశంలోని చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు
- 2011 జనాభా లెక్కల ప్రకారమే లోక్‌సభ సీట్ల పెంచాలని బిల్లులో ప్రతిపాదించిన కేంద్రం
- ఈనెల 16న లోక్‌సభలో ప్రవేశపెట్టనున్న కేంద్రం

## అల్‌ఖైదా కంటే వైకాపా ఏం తక్కువ?

తీవ్రవాదాన్ని మించి ప్రమాదకరంగా ఆ పార్టీ ఉన్మాదం

రాష్ట్రానికి పెట్టుబడులు రాకుండా అడ్డుకునేందుకు కుట్రలు

ఆస్తి కోసం సొంత చెల్లిని ఇబ్బంది పెడుతున్న జగన్

అధికారం కోసం ప్రజల ప్రాణాల్ని బలిపెట్టే భావజాలం వైకాపాది

జగన్, వైకాపా నాయకుల తీరుపై విరుచుకుపడిన మంత్రి కొలుసు పార్థసారథి



: వైకాపా అనుసరిస్తున్న అరాచక విధానాలు, ఆ పార్టీ నాయకుల ఆలోచన ధోరణి చూస్తుంటే అంతర్జాతీయ తీవ్రవాద సంస్థలైన అల్‌ఖైదా, ఐసిస్‌లకు.. వైకాపాకు మధ్య పెద్దగా తేడా లేదనిపిస్తోందని గృహనిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి ధ్వజమెత్తారు. తీవ్రవాదం కంటే ప్రమాదకరంగా ఆ పార్టీ తయారైందని ధ్వజమెత్తారు. "సమాజానికి ఎంత నష్టం జరుగుతుందో ఆలోచించకుండా.. భయాందోళనలు సృష్టించడం ద్వారా వారి సిద్ధాంతాలను ప్రజలపై రుద్దాలని తీవ్రవాద సంస్థలు చూస్తాయి. వైకాపా కూడా అదే బాటలో నడుస్తోంది. అందుకే ఆ పార్టీ నేతలు.. అసభ్య భాషను, అరాచక దాడుల్ని నమ్ముకుని సామాజిక మాధ్యమాల్లో రెచ్చగొట్టే వీడియోలు, తప్పుడు పోస్టులు పెడుతూ సమాజంపైకి

వివరాలు 2లో..



## ఆర్టికల్ 370 రద్దు తర్వాత పూర్తిగా అమల్లోకి రాజ్యాంగం

- డెహ్రాడూన్ పర్యటనలో ప్రధాని మోదీ
- దిల్లీ, డెహ్రాడూన్ ఎకనామిక్ కారిడార్ ప్రారంభం
- చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు అమల్లో జాప్యం జరగడానికి వీల్లేదు
- ఉమ్మడి పౌరస్మృతిని అమలు చేసిన తొలి రాష్ట్రంగా ఉత్తరాఖండ్ నిలించింది
- హరిద్వార్‌లో జరగనున్న కుంభమేళా సందర్భంగా ఉత్తరాఖండ్‌ను శుభ్రంగా ఉంచాలని పిలుపు

వివరాలు 2లో..

## పవన్ కల్యాణ్‌తో బంజారా సేవా సంఘ్ ప్రతినిధుల భేటీ



ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌ను ఆలిండియా బంజారా సేవా సంఘ్ ప్రతినిధులు మంగళవారం కలిశారు. మంగళగిరిలోని ఉపముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయంలో ఈ సమావేశం జరిగింది. గిరిజన ప్రాంతాల్లోని వివిధ సమస్యలపై వినతిపత్రం సమర్పించడంతో పాటు నాన్ షెడ్యూల్డ్ ప్రాంతాల్లోని గిరిజన ఆవాసాల్లో పల్లె పండుగ, సాస్కీ తదితర కార్యక్రమాల కింద సౌకర్యాలు కల్పిస్తున్నందుకు పవన్ కల్యాణ్‌కు వారు ధన్యవాదాలు తెలియజేశారు. సమావేశంలో బంజారా సేవా సమితి రాష్ట్ర అధ్యక్షుడు చక్రి నాయక్, ప్రధాన కార్యదర్శి రాంబాబు నాయక్, ఉపాధ్యక్షుడు దొరస్వామి నాయక్ పాల్గొన్నారు.

# క్వాంటమ్ కంప్యూటర్.. మేడిన్ అమరావతి

-మొదటిపేజీ తరువాయి

కొరత లేదని, ప్రభుత్వం నుంచి పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు. క్వాంటమ్ కంప్యూటింగ్ రంగంలో భారత్ స్వావలంబన సాధించాలని, భవిష్యత్తులో ఏ అప్లికేషన్ కోసమూ ఎవరిపైనా ఆధారపడకూడదని ఆయన స్పష్టం చేశారు. అమరావతిలోని ఎస్ఆర్ఎం యూనివర్సిటీలో, గన్నవరంలోని మేధాటవర్స్‌లోనూ ఏర్పాటుచేసిన దేశంలోనే మొదటి క్వాంటమ్ రిఫరెన్స్ ఫెసిలిటీస్‌ని ఆయన మంగళవారం ప్రారంభించి, జాతికి అంకితం చేశారు. ఎస్ఆర్ఎం వర్సిటీలో నిర్వహించిన కార్యక్రమంలో చంద్రబాబు ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. "దేశీయ పరిజ్ఞానంతో తయారుచేసిన క్వాంటమ్ కంప్యూటర్లతో రిఫరెన్స్ ఫెసిలిటీస్ ఏర్పాటుచేయడం క్వాంటమ్ టెక్నాలజీ రంగంలో మన దేశం వేసిన పెద్ద ముందడుగు. ప్రపంచ క్వాంటమ్ దినోత్సవం, రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ జయంతి రోజున మనం వీటిని ప్రారంభించడం గొప్ప విషయం. దేశీయ పరిజ్ఞానంతో క్వాంటమ్ కంప్యూటర్లు తయారు చేయగలమని నిరూపించాం. ఇది ప్రారంభం మాత్రమే. ఈ ప్రక్రియను వేగవంతం చేయండి. అత్యాధునిక కంప్యూటర్లను తయారుచేయండి" అన్నారు. ఇప్పటివరకు ఐటీలో నూతన ఆవిష్కరణలకు అమెరికాలోని సిలికాన్ వ్యాలీ కేంద్రంగా ఉందని, ఇకపై క్వాంటమ్ ఆవిష్కరణల కోసం అందరూ అమరావతిలోని క్వాంటమ్ వ్యాలీ వైపు చూస్తారని పేర్కొన్నారు. క్వాంటమ్, ఏఐ, సెమీకండక్టర్ల లాంటివి ఇకపై భారత్ అభివృద్ధి ప్రయాణంలో అంతర్భాగాలని సీఎం తెలిపారు. అమరావతి క్వాంటమ్ మిషన్‌కి సంపూర్ణ సహకారం అందిస్తున్న ప్రధాని నరేంద్రమోదీకి కృతజ్ఞతలు తెలియజేస్తున్నానని సీఎం అన్నారు. "టెక్నాలజీని లోతుగా అర్థం చేసుకునే నాయకులు తక్కువగా ఉంటారు. ప్రధాని మోదీ అలాంటి కొద్దిమందిలో ఒకరు. క్వాంటమ్ కంప్యూటింగ్, సెమీకండక్టర్ రంగాల్లో భారత్ వేగంగా పురోగమిస్తోందంటే దానికి ఆయన దార్శనికతే కారణం" అని చంద్రబాబు కొనియాడారు.

### క్వాంటమ్ మిషన్‌ను పరిశీలిస్తున్న సీఎం

దేశంలోనే తొలి క్వాంటమ్ హార్డ్‌వేర్ టెస్ట్‌బెడ్స్ ఏర్పాటు ఆంధ్రప్రదేశ్‌కు గర్వకారణమని సీఎం పేర్కొన్నారు. ఒకప్పుడు ఐటీని అందిపుచ్చుకోవడంలో తెలుగునేల నిర్ణయాత్మక పాత్ర పోషించిందని, ఇప్పుడు క్వాంటమ్ విప్లవంలోనూ అలాంటి పాత్రకు సిద్ధమైందని ఆయన పేర్కొన్నారు. "పారిశ్రామిక రంగానికి విద్యుత్, డిజిటల్ యుగానికి ఇంటర్నెట్ లాగే.. ఆధునిక ఆవిష్కరణలకు క్వాంటమ్ టెక్నాలజీ ప్రధానం. క్వాంటమ్ సాంకేతికతలో స్వావలంబన సాధించే దేశాలే భవిష్యత్తును శాసిస్తాయి. భారతీయ పరిశోధకులు, పరిశ్రమలు క్వాంటమ్ హార్డ్‌వేర్‌ను పరీక్షించేందుకు అమరావతి క్వాంటమ్ రిఫరెన్స్ ఫెసిలిటీస్ ప్రధాన కేంద్రాలవుతాయి" అని సీఎం పేర్కొన్నారు. "ఈ రోజు ప్రారంభించినవి పూర్తిస్థాయి క్వాంటమ్ హార్డ్‌వేర్ టెస్ట్‌బెడ్స్. కొత్తగా తయారుచేసిన క్వాంటమ్ కాంపొనెంట్స్ వ్యాలిడేషన్, బెంచ్‌మార్కింగ్, సర్టిఫికేషన్ ప్రక్రియలను ఇక్కడ నిర్వహించవచ్చు. భారత్ ఇక క్వాంటమ్ టెక్నాలజీలను అధ్యయనం చేయడానికే పరిమితం కాదని, వాటిని తయారుచేయడం, పరీక్షించడం, రిఫైన్ చేయడం లాంటి ప్రక్రియల్లో దూసుకెళుతుందనడానికి నిదర్శనం" అని తెలిపారు. ఎస్ఆర్ఎంలో ఏర్పాటు చేసిన 1ఎస్ క్వాంటమ్ కంప్యూటర్ పరిశోధనలకు, మేధా టవర్స్‌లోని 1క్యూ కంప్యూటర్ పరిశ్రమలకు ప్రధానంగా ఉపయోగపడతాయని తెలిపారు. "ఆంధ్రప్రదేశ్ ఇకపై ఆధునిక టెక్నాలజీలను వినియోగించుకోవడానికే పరిమితం కాదు. వాటి ఆవిష్కరణ, నిర్మాణం, ప్రొడక్ట్ తయారీ ఇక్కడే జరుగుతుంది. వాటిని ఎగుమతి చేస్తుంది. ఈ బృహత్ లక్ష్యంలో క్వాంటమ్ టెక్నాలజీ కీలకపాత్ర పోషిస్తుంది. ఔషధాలను కనుక్కోవడం, మెటీరియల్ సైన్స్, సురక్షితమైన కమ్యూనికేషన్ల వ్యవస్థల రూపకల్పన, రక్షణరంగ సిమ్యులేషన్లు, వాతావరణ మోడళ్ల లాంటి రంగాల్లో క్వాంటమ్ టెక్నాలజీ అద్భుతాలు చేస్తుంది" అని తెలిపారు.

### ఒక చిన్న ఆలోచనతో ఈ ప్రయాణం మొదలైంది

"ఎవరు ఏ కొత్త ఆలోచనతో వచ్చినా దానిపై లోతుగా దృష్టిపెట్టడం నాకు అలవాటు. ఒకరోజు మద్రాస్ ఐఐటీ డైరెక్టర్ కామకోటి ఫోన్ చేసి.. క్వాంటమ్ కంప్యూటింగ్ రంగంలో విస్తృత అవకాశాలున్నాయని, ఐబీఎం భారత్‌లో క్వాంటమ్ కంప్యూటర్ ఏర్పాటు చేయాలనుకుంటోందని తెలిపారు. ఐబీఎంలో పనిచేస్తున్న వెంకట్ సుబ్రమణియంని సంప్రదించగా.. భాగస్వాములు దొరికితే తమకు అభ్యంతరం లేదని చెప్పారు. టీసీఎస్, ఎల్అండ్‌టీతో మాట్లాడితే వాళ్లూ సరేనన్నారు. ప్రధాని అనుమతి కోరితే ఆయనా ప్రోత్సహించారు. అమరావతి క్వాంటమ్ వ్యాలీ ప్రయాణం అలా మొదలైంది" అని సీఎం వివరించారు. డిసెంబరు నాటికి అమరావతిలో క్వాంటమ్ వ్యాలీ భవనం సిద్ధమవుతుందని, ఐబీఎం క్వాంటమ్ కంప్యూటర్‌ని ఏర్పాటు చేస్తుందని తెలిపారు.

### క్వాంటమ్ కంట్రోలర్ వివరాలు తెలుసుకుంటున్న సీఎం చంద్రబాబు

ఎస్ఆర్ఎం యూనివర్సిటీలో ఏర్పాటుచేసిన క్వాంటమ్ రిఫరెన్స్ ఫెసిలిటీని ప్రారంభించిన అనంతరం... అక్కడి క్వాంటమ్ కంప్యూటర్‌ను సీఎం పరిశీలించారు. అది ఎలా పనిచేస్తుందో క్యూబిట్ ఫోర్స్ సంస్థ వ్యవస్థాపకుడు వెంకట్ సుబ్రమణియం వివరించారు. అనంతరం మేధాటవర్స్‌లోని రిఫరెన్స్ ఫెసిలిటీని వర్చువల్‌గా సీఎం ప్రారంభించారు. క్వాంటమ్ రిఫరెన్స్ ఫెసిలిటీస్‌ని ఏర్పాటుచేసిన వెంకట్ సుబ్రమణియం, క్యూబిటెక్ సంస్థ వ్యవస్థాపకుడు పృథ్వీ, ఎస్ఆర్ఎం యూనివర్సిటీ ప్రో ఛాన్సలర్ సత్యనారాయణన్, వైస్ ఛాన్సలర్ సతీష్‌కుమార్‌లను అభినందించారు. కేంద్రప్రభుత్వ శాస్త్ర సలహాదారు అజయ్‌కుమార్ సూద్ దిల్లీ నుంచి వర్చువల్‌గా పాల్గొన్నారు. కేంద్ర శాస్త్ర, సాంకేతిక శాఖ కార్యదర్శి అభయ్ కరాందికర్, తిరుపతి, మద్రాస్ ఐఐటీ డైరెక్టర్లు సత్యనారాయణ, కామకోటి, అమరావతి క్వాంటమ్ మిషన్ డైరెక్టర్ సీవీ శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

### కేవలం 8 నెలల్లోనే సాధించాం

అమరావతిలో క్వాంటమ్ రిఫరెన్స్ ఫెసిలిటీస్ ఏర్పాటుచేయాలన్న ఆలోచన మొగ్గతొడిగాక.. ఎనిమిది నెలల్లోనే ఆచరణలోకి తెచ్చామని సీఎం తెలిపారు. "నేను అమరావతిలో క్వాంటమ్ కంప్యూటర్ తయారు చేయాలని చెప్పినప్పుడు... ఎవరి నుంచీ తగిన స్పందన లేదు. క్వాంటమ్ హార్డ్‌వేర్ తయారీదారులు, శాస్త్రవేత్తలతో సమావేశం నిర్వహించాక.. 4 క్యూబిట్ క్వాంటమ్ కంప్యూటర్ రూపొందించడానికి కనీసం రెండేళ్లు పడుతుందన్నారు. ఇంకా వేగంగా చేయాలని చెబితే.. ప్రపంచ క్వాంటమ్ దినోత్సవం నాటికి సిద్ధం చేస్తామని చెప్పారు. మీ అందరిలో సామర్థ్యం ఉంది. చేయగలం అని గట్టిగా అనుకుంటే సాధిస్తారు. అదే స్ఫూర్తితో ఐబీఎం క్వాంటమ్ కంప్యూటర్ వచ్చేనాటికి.. అలాంటి కంప్యూటరే ఇక్కడ సిద్ధం చేయాలని కోరుతున్నాను. శాస్త్రవేత్తలు, విద్యావేత్తలు, మేధావులు ఆలోచించండి. ఇప్పుడు మన దగ్గర 'ప్రూఫ్ ఆఫ్ కాన్సెప్ట్' ఉంది. దాన్ని పెద్దస్థాయిలో చేయడమే మీ పని" అని చంద్రబాబు పేర్కొన్నారు.

# అల్‌ఖైదా కంటే వైకాపా ఏం తక్కువ?

-మొదటిపేజీ తరువాయి

విషం చిమ్ముతున్నారు. యువతను తప్పుదారి పట్టించే ప్రయత్నం చేస్తున్నారు" అని విరుచుకుపడ్డారు. ప్రజాస్వామ్య విలువల్ని తుంగలో తొక్కి అరాచకమే ఎజెండాగా ముందుకు సాగుతున్న వైకాపా వారి వల్ల రాష్ట్రానికి ఎంత ప్రమాదమో ప్రజలు గుర్తించాలన్నారు. మంగళగిరిలోని పార్టీ కార్యాలయంలో ఆయన మంగళవారం విలేకరులతో మాట్లాడారు.

### పాబ్లో ఎస్కోబార్ తరహా తీవ్రవాద భావజాలం జగన్‌ది

కొలంబియాలో పాబ్లో ఎస్కోబార్ కొకైన్ వ్యాపారం చేసి మాఫియా రాజ్యాన్ని ఏలాడు. 'డబ్బు లేదా బుల్లెట్' అనే సిద్ధాంతంతో ముందుకు నడిచాడు. ఇప్పుడు జగన్ కూడా అదే మాఫియా, ఉగ్రవాద భావజాలంతో.. 'డబ్బు లేదా అధికారం' అనే సూత్రంతో రాష్ట్రాన్ని సర్వనాశనం చేస్తున్నారు. ప్రజల్లో, పెట్టుబడిదారుల్లో భయాన్ని సృష్టించి, రాష్ట్రాన్ని విచ్ఛిన్నం చేయడమే పనిగా పెట్టుకున్నారు.

### మంత్రి కొలుసు పార్థసారథి

"రాష్ట్రానికి పెట్టుబడులు రాకుండా, యువతకు ఉపాధి దొరకకుండా చేయడమే లక్ష్యంగా వైకాపా పనిచేస్తోంది. ప్రపంచవ్యాప్తంగా పెట్టుబడిదారులు ఆంధ్రప్రదేశ్ వైపు చూస్తుంటే వారిని బెదిరించేలా ఆ పార్టీ నేతలు మాట్లాడుతున్నారు. ఏ రాజకీయ పార్టీ అయినా ప్రతిపక్షంలో ఉన్నప్పుడు 'అధికారంలోకి వస్తే ప్రస్తుత ప్రభుత్వం కంటే మెరుగ్గా పరిపాలిస్తాం' అని చెబుతుంది. కానీ వైకాపా మాత్రం విధ్వంసం, బెదిరింపులు, హత్యలే ఎజెండాగా చేసుకుని పెట్టుబడిదారుల్ని భయాందోళనలకు గురిచేస్తోంది. ఇలాంటి విధ్వంసక భావజాలమున్న వైకాపా నుంచి రాష్ట్రాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి పౌరుడిపైనా ఉంది" అని పేర్కొన్నారు.

### మహిళలకు సమాన ఆస్తి హక్కు రద్దు చేస్తారేమో!

"కుటుంబ గౌరవాన్ని రోడ్డున పడేసే వారిని చూసి.. ఎవరైనా ఛీత్కరించుకుంటారు. ఇప్పుడు జగన్ పరిస్థితీ అలాగే ఉంది. అధికారం, ఆస్తి కోసం తల్లిని, చెల్లిని ఇబ్బంది పెడుతున్నారు. ఆస్తి కోసం ఇంతలా దిగజారుతున్న జగన్.. ఎన్టీఆర్ మహిళలకు కల్పించిన సమాన ఆస్తి హక్కును రద్దు చేసినా ఆశ్చర్యపోనక్కర్లేదు. దీనికి ఉదాహరణలు కోకొల్లలు. తనకు నచ్చలేదనే ఒకేఒక్క కారణంతో ప్రజావేదికను కూల్చివేసి వినాశనానికి నాంది పలికారు. రాజధాని అమరావతిపై విద్వేషాన్ని అధికారంలోకి వచ్చిన తొలినాటి నుంచే చూపించారు. ఆచరణ సాధ్యం కాని మూడు రాజధానులనే ముసుగు తొడిగి రాష్ట్రాన్ని అయోమయంలోకి నెట్టారు. తన నిర్ణయాన్ని వ్యతిరేకించారనే కారణంతో శాసనమండలిని రద్దు చేసేందుకు ప్రయత్నించారు" అని పార్థసారథి ఆక్షేపించారు.

### అది ప్రజాస్వామ్య పార్టీనా? ఉగ్రవాద ముఠానా?

"వైకాపా నాయకులు తమ ఆస్తుల్ని కాపాడుకోవడం కోసం, దోచుకున్నది దాచుకోవడం కోసం జగన్ చెప్పిన ప్రతి అరాచకానికి తలలూపుతున్నారు. ఇలాంటి గుడ్డి విధేయత దేశ చరిత్రలో ఏ రాజకీయ పార్టీలోనూ చూడలేదు. జగన్ ఏం చెబితే అది చేస్తాం. అవసరమైతే ఆత్మాహుతి దళంగా మారుతామని ఎంపీ మిథున్‌రెడ్డి మాట్లాడటం చూస్తుంటే.. వైకాపా ప్రజాసామ్య పార్టీనా? లేక ఉగ్రవాద ముఠానా? అనిపిస్తోంది. చంపేస్తాం.. నరికేస్తాం.. పొడిచేస్తాం అని మాట్లాడేవారు ప్రజాస్వామ్యవాదులు ఎలా అవుతారు? వారి భాష ఉగ్రవాదుల కంటే దారుణంగా ఉంది. అందుకే వైకాపాను ప్రజలు రాజకీయపార్టీగా కాకుండా గొడ్డలి పార్టీగా చూస్తున్నారు. ఉగ్రవాద సంస్థలు ఏ విధంగా అభివృద్ధిని, వ్యవస్థల్ని కుప్పకూలుస్తాయో.. వైకాపా నాయకులు కూడా రాష్ట్ర వనరులు, వ్యవస్థలను ధ్వంసం చేశారు. వారి ఉన్మాద పూరిత భావజాలం రాష్ట్ర భవిష్యత్తుకు గొడ్డలిపెట్టు" అని వ్యాఖ్యానించారు.

### ప్రజల్ని బతకనివ్వని వికృత భావజాలం

'బలహీనవర్గాలకు చెందిన తోట చంద్రయ్య ఏం తప్పు చేశారు? ఒక పార్టీ సిద్ధాంతాన్ని నమ్ముకున్న ఆయన్ను.. తమ పార్టీ వైపు తిప్పుకోలేక నడిరోడ్డుపై దారుణంగా హత్య చేశారు. ఒక సామాన్య కార్యకర్తను కూడా బతకనివ్వని వారి వికృత భావజాలం ఉగ్రవాదమే. తన సోదరిని అవమానించారని ప్రశ్నించిన అమర్‌నాథ్‌గౌడ్ అనే బాలుడిని కిరాతకంగా సజీవ దహనం చేసినప్పుడు వీరి ఉన్మాదం మరింత బయటపడింది" అని మంత్రి మండిపడ్డారు.

### గంజాయి బ్యాచ్‌ను పరామర్శించిన ఘనత వారిదే..

"సాధారణంగా ఏ రాజకీయ పార్టీ అయినా ప్రజాసమస్యలపై పోరాటం చేస్తుంది. జగన్ తీరు దానికి పూర్తి భిన్నం. తెనాలిలో గంజాయికి బానిసై ప్రజల్ని భయభ్రాంతులకు గురిచేస్తున్న వ్యక్తిపై పోలీసులు చర్యలు తీసుకుంటే.. జగన్ వెళ్లి ఆయన్ని పరామర్శించి ఓదార్చారు. సమాజానికి హాని చేసే వారిని వెనుకేసుకురావడం దారుణం. రైతుల పరామర్శ పేరుతో పర్యటిస్తూ.. నరుకుతాం, చంపుతామంటూ బోర్డులు ప్రదర్శించారు. రప్పా రప్పా అంటూ నినాదాలు చేయించారు. ఇలాంటి చర్యలతో సమాజానికి జగన్ ఇస్తున్న సందేశం ఏంటి?" అని మంత్రి ప్రశ్నించారు.

### అధికారం కోసం ఎంతటి దారుణానికైనా ఒడిగట్టే చరిత్ర వైకాపాది...

"అధికారం కోసం వైకాపా ఎంతటి దారుణానికైనా ఒడిగడుతుందని చెప్పడానికి వైఎస్ వివేకా హత్యే నిదర్శనం. 2019 ఎన్నికల్లో వైకాపా గెలిచేందుకు ఆయన హత్యను జగన్ వినియోగించుకున్నారు. వివేకా శరీరంపై గాయాల్ని చూస్తే అది హత్యే అని ఎవరికైనా ఇట్టే అర్థమవుతుంది. కానీ దాన్ని గుండెపోటు మరణంగా ప్రచారం చేయగలిగిన ఘనత వైకాపాకే దక్కుతుంది. సొంత తండ్రి, బాబాయి మరణాల్ని రాజకీయానికి వాడుకున్న చరిత్ర జగన్‌ది. అధికారం కోసం కుటుంబాన్ని, వ్యవస్థల్ని, చివరకు ప్రజల ప్రాణాల్ని పణంగా పెట్టే తీవ్రవాద భావజాలమున్న వైకాపాను శాశ్వతంగా తిరస్కరించాల్సిన సమయం వచ్చింది" అని మంత్రి పార్థసారథి అన్నారు.

# సమాజం బాగు కోసమే రెడ్‌బుక్

-మొదటిపేజీ తరువాయి

'నా రెడ్‌బుక్ సమాజం బాగు కోసం. జగన్ మాత్రం రాజారెడ్డి రాజ్యాంగంతో సమాజాన్ని నాశనం చేయాలనుకుంటున్నారు. అధికారంలో ఉన్నప్పుడు విధ్వంసం, దాడులు, హత్యలు, అవినీతితో చెలరేగిపోయిన జగన్.. అధికారం పోయాక కూటమి ప్రభుత్వంపై విష ప్రచారాలు చేస్తున్నారు. గతంలో తెదేపా కార్యాలయం, చంద్రబాబు ఇల్లు, నాయకులపై వైకాపా నేతలు దాడులు చేశారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలపై దమనకాండకు పాల్పడ్డారు. అమర్నాథ్‌గౌడ్, అబ్దుల్ సలాం, తోట చంద్రయ్యలను వెంటాడి మరీ చంపారు. డాక్టర్ సుధాకర్, కోడెల శివప్రసాద్, మిస్బా అనే చిన్నారిని వేధించి వారి మరణానికి కారకులయ్యారు. ఏ ఆత్మ చెప్పిందో కానీ ఇప్పుడు మావిగన్ అంటూ జగన్ కలవరిస్తున్నారు. మనమంతా ఐకమత్యంగా, పోరాట స్ఫూర్తితో వైకాపా ఫేక్ ప్రచారాలను తిప్పికొట్టాలి" అని పేర్కొన్నారు.

## 850 అసెంబ్లీ స్థానాలు

మహిళలకు చట్టసభల్లో 33% రిజర్వేషన్లు అమలు చేయడానికి వీలుగా ఇప్పుడున్న లోక్‌సభ స్థానాల గరిష్ఠ సంఖ్య (550)ని గరిష్ఠంగా 850 వరకూ పెంచాలని కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించింది. ఇందులో రాష్ట్రాల నుంచి ఎన్నికయ్యే వారి సంఖ్యను 815గా, కేంద్ర పాలిత ప్రాంతాల నుంచి 35గా పేర్కొంది. ఇందుకోసం రాజ్యాంగంలోని ఆర్టికల్ 81ని సవరించాలని నిర్ణయించింది. దీని ప్రకారం దేశంలో లోక్‌సభ స్థానాలు 54.54% మేర పెరిగే అవకాశముంది. ఇప్పటివరకూ ఆర్టికల్ 81(1) కింద రాష్ట్రాల నుంచి ఎన్నికయ్యే గరిష్ఠ లోక్‌సభ సభ్యుల సంఖ్య 530, కేంద్ర పాలిత ప్రాంతాల నుంచి ఎన్నికయ్యే వారి గరిష్ఠ సంఖ్య 20గా ఉన్నాయి. అయితే ప్రస్తుతం 543 లోక్‌సభ స్థానాలకే ఎన్నికలు జరుగుతున్నాయి.

పలు అధికరణలకు సవరణలు

మహిళా రిజర్వేషన్లను 2029 నుంచి అమలు చేయడానికి వీలుగా 131వ రాజ్యాంగ సవరణ బిల్లు-2026ను కేంద్ర ప్రభుత్వం తీసుకొస్తోంది. ఇందులో 2026 జనాభా లెక్కలకు ముందే నియోజకవర్గాలను పునర్విభజించడానికి వీలు కల్పిస్తూ ఆర్టికల్ 55, 81, 82, 170, 330, 332, 334ఏలకు సవరణలు ప్రతిపాదించింది.

కచ్చితంగా పెరిగేవెన్ని?

రాజ్యాంగంలో గరిష్ఠంగా 550 లోక్‌సభ స్థానాలను పేర్కొన్నా ప్రస్తుతం 543 మాత్రమే ఉన్నాయి. అంటే.. గరిష్ఠ సంఖ్యలో 98.72% నియోజకవర్గాలే ఉన్నట్లు లెక్క. ఆ నిష్పత్తి ప్రకారం చూస్తే కేంద్ర ప్రభుత్వం కొత్త స్థానాల సంఖ్యను 840దాకా ఖరారుచేసే సూచనలున్నాయి. అయితే ఇదివరకు వివిధ పార్టీల నాయకులతో పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు చర్చలు జరిపినప్పుడు.. మొత్తం స్థానాలను గంపగుత్తగా 50% పెంచుతామని చెప్పారు. ఆ ప్రకారం చూస్తే ఇప్పుడున్న 543 స్థానాలు 816కి చేరే అవకాశం ఉంటుంది.

ప్రతి జనాభా లెక్కల తర్వాత అసెంబ్లీల్లో సీట్ల పెంపు..

ఆర్టికల్ 81(3)లో 2026 తర్వాత ప్రచురించే తొలి జనాభా లెక్కల ఆధారంగానే లోక్‌సభ నియోజకవర్గాలను పునర్విభజించాలని ఉంది. ఇప్పుడు దాన్ని సవరించి.. గతంలోని జనాభా లెక్కల ఆధారంగా నియోజకవర్గాలను పునర్విభజించడానికి తాజా బిల్లును కేంద్రం ప్రతిపాదించింది.

రాజ్యాంగంలోని ఆర్టికల్ 82 అసెంబ్లీ స్థానాల పునర్విభజన, ఆర్టికల్ 170 అసెంబ్లీ స్థానాల గరిష్ఠ సంఖ్య గురించి చెబుతున్నాయి. ఇప్పటివరకూ ఉన్న నిబంధనల ప్రకారం ఆర్టికల్ 82 కింద అసెంబ్లీ స్థానాలను పునర్విభజించాలంటే 2026 తర్వాత ప్రచురించే తొలి జనాభా లెక్కలను పరిగణనలోకి తీసుకోవాలి. ఇప్పుడు ఆ నిబంధనను సవరించి ప్రతి జనాభా లెక్కల తర్వాత అసెంబ్లీ స్థానాలను పునర్విభజించడానికి అవకాశం కల్పించారు.

ఆర్టికల్ 334ఏలో ఇదివరకు 106వ రాజ్యాంగ సవరణ చట్టం-2023 (మహిళా రిజర్వేషన్ల చట్టం) ఆమోదం పొందిన తర్వాత చేపట్టే తొలి జనాభా లెక్కల ప్రాతిపదికన నిర్వహించే నియోజకవర్గాల పునర్విభజన తర్వాతే మహిళా రిజర్వేషన్లు అమల్లోకి వస్తాయని పేర్కొన్నారు. ఇప్పుడు దాన్ని సవరించి డీలిమిటేషన్ ప్రక్రియ పూర్తయిన వెంటనే ఇవి అమల్లోకి వస్తాయని స్పష్టత ఇచ్చారు.

కొత్త జనాభా లెక్కలు ఆలస్యమవుతాయనే..

ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం 2027 జనాభా లెక్కల నోటిఫికేషన్ జారీ చేసినప్పటికీ అందుకు సంబంధించి లెక్కలు వెలువడటానికి ఆలస్యమవుతుందన్న ఉద్దేశంతోనే ముందస్తుగా ఈ రాజ్యాంగ సవరణ బిల్లులను తీసుకొస్తున్నట్లు కేంద ప్రభుత్వం పేర్కొంది. దాని ప్రకారం వెళ్తే ప్రజాస్వామ్య ప్రక్రియలో మహిళా భాగస్వామ్యం పెంచడంలో జాప్యం జరుగుతుందని అభిప్రాయపడింది.

## బీహార్ నూతన ముఖ్యమంత్రిగా సామ్రాట్ చౌదరి

బీహార్ తదుపరి ముఖ్యమంత్రిగా బీజేపీ నాయకుడు సామ్రాట్ చౌదరి నేడు ప్రమాణ స్వీకారం చేయనున్నారు. నితీశ్ కుమార్ ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేసిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో బీజేపీ శాసనసభా పక్షం సామ్రాట్ చౌదరిని తమ పార్టీ నేతగా ఎన్నుకుంది. దీనితో ఆయన రేపు ప్రమాణం చేయనున్నారు. మధ్యప్రదేశ్ మాజీ సీఎం, కేంద్రమంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ ఈ ఎన్నిక కోసం పరిశీలకుడిగా వచ్చారు.

1990లో ఆర్జేడీలో సామ్రాట్ చౌదరి తన రాజకీయ ప్రస్థానాన్ని ప్రారంభించారు. 1999లో వ్యవసాయ శాఖ మంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. ఆ తర్వాత ఆయన జేడీయూలో చేరారు. అనంతరం ఆయన బీజేపీలో చేరగా, కొన్నాళ్లకే 2018లో బీహార్ బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. 2023 మార్చిలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు అయ్యారు. ఇప్పుడు బీహార్ ముఖ్యమంత్రి పదవిని చేపట్టిన మొదటి బీజేపీ నేతగా ఆయన నిలవనున్నారు. ఆయన కుష్వాహా వర్గానికి చెందిన నాయకుడు.

బీహార్‌లో యాదవుల తర్వాత కుష్వాహాల ప్రాబల్యం ఎక్కువగా ఉంటుంది. బీహార్‌లో ఇప్పటి వరకు ఈ వర్గానికి చెందిన నాయకుడికి ముఖ్యమంత్రి అయ్యే అవకాశం రాలేదు. సామ్రాట్ చౌదరిని పెద్ద నాయకుడిగా చేస్తానని బీహార్ ఎన్నికల ప్రచారంలో కేంద్రమంత్రి అమిత్ షా ప్రకటించారు. ఈ క్రమంలో తొలుత ఉపముఖ్యమంత్రిగా చేశారు. రేపు సీఎంగా ప్రమాణ స్వీకారం చేయనున్నారు.

## ఛత్తీస్‌గఢ్‌లోని పవర్ ప్లాంట్‌లో పేలుడు..

ఛత్తీస్‌గఢ్‌లోని వేదాంత పవర్ ప్లాంట్‌లో భారీ పేలుడు చోటుచేసుకుంది. శక్తి జిల్లాలోని సింగితరాయ్ గ్రామంలోని ఈ విద్యుత్ ప్లాంట్‌లో మధ్యాహ్నం బాయిలర్ ట్యూబ్‌లో పేలుడు సంభవించడంతో 9 మంది మృతి చెందగా, 30 మందికి పైగా గాయబడినట్లు పోలీసులు తెలిపారు. మరికొందరు కార్మికులు లోపల చిక్కుకుపోయి ఉంటారని ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. ఈరోజు కార్మికులు పని చేస్తున్న సమయంలో బాయిలర్‌లో వైఫల్యం తలెత్తడంతో ఒక్కసారిగా పేలుడు సంభవించినట్లు ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. ఈ ఘటనలో పలువురు మృతి చెందారు. దీనితో వెంటనే కార్మికులు ప్లాంట్ నుంచి బయటకు పరుగెత్తే ప్రయత్నం చేయడంతో తొక్కిసలాట జరిగినట్లు చెప్పారు. దీనితో మరికొందరు గాయాలపాలయ్యారని వెల్లడించారు. క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నట్లు వెల్లడించారు. సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకుని సహాయక చర్యలు ప్రారంభించింది.

# అంబేద్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించిన ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు





- మహిళల హక్కుల కోసం మంత్రి పదవినే త్యాగం చేసిన మహనీయుడు అంబేద్కర్
- అంబేద్కర్ మహిళా హక్కుల పోరాట చరిత్రను పాఠ్యాంశాల్లో చేర్చాలని కోరుతా.

**గన్నవరం, పెన్ సత్తా, ఏప్రిల్ 14:**కృష్ణా జిల్లా గన్నవరం నియోజకవర్గం, ఉంగుటూరు మండలం ఆత్కూరు గ్రామంలో భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన అంబేద్కర్ విగ్రహాన్ని ప్రభుత్వ విప్, గన్నవరం శాసనసభ్యులు యార్లగడ్డ వెంకట్రావు ఆవిష్కరించారు. అనంతరం విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. ఈ విగ్రహ ఏర్పాటుకు సహకరించిన ప్రతి ఒక్కరికీ ఆయన హృదయ పూర్వక ధన్యవాదాలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో యార్లగడ్డ వెంకట్రావు మాట్లాడుతూ, ప్రపంచ దేశాల రాజ్యాంగాలను క్షుణ్ణంగా పరిశీలించి, భారతదేశానికి అద్భుత మైన లిఖిత రాజ్యాంగాన్ని ప్రసాదించిన మహనీయుడు అంబేద్కర్ అని కొనియాడారు. అయితే, కేవలం రాజ్యాంగ నిర్మాతగానే కాకుండా, సమాజంలో మహిళల హక్కుల కోసం ఆయన చేసిన పోరాటం చరిత్రలో చాలామందికి తెలియని కోణమని ఆయన గుర్తు చేశారు. 1940 వ దశకం చివరలోనే హిందూ కోడ్ బిల్లు ద్వారా మహిళలకు ఆస్తి హక్కు, వివాహ వ్యవస్థలో సమానత్వం కల్పించాలని అంబేద్కర్ సంకల్పించారని తెలిపారు. స్వతంత్ర భారత తొలి న్యాయశాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత, అప్పటి ప్రధాని నెహ్రూతో చర్చించి హిందూ యాక్ట్ బిల్లును రూపొందించిన అసలైన ఆర్కిటెక్ట్ అంబేద్కరేనని యార్లగడ్డ కొనియాడారు. 1951 లో ఈ బిల్లును లోక్ సభలో ప్రవేశపెట్టినప్పుడు, నాటి మెజారిటీ సభ్యుల నుంచి తీవ్ర వ్యతిరేకత ఎదురైందని, బహు భార్యత్వానికి వ్యతిరేకంగా, మహిళలకు ఆస్తిలో వాటా కల్పించే చట్టాలను అంగీకరించడానికి అప్పట్లో అనేకులు సుముఖంగా లేరని వివరించారు. తాను నమ్మిన సిద్ధాంతం, మహిళల ఆత్మగౌరవం కోసం ప్రవేశపెట్టిన బిల్లు వీగిపోవడంతో, పదవి కంటే విలువలే ముఖ్యమని భావించిన అంబేద్కర్, 1951 సెప్టెంబర్ 27న తన మంత్రి పదవికి రాజీనామా చేసి నైతికతను చాటుకున్నారని ఎమ్మెల్యే గుర్తు చేశారు. అంబేద్కర్ వేసిన పునాదుల వల్లే తదనంతర కాలంలో నెహ్రూ ప్రభుత్వం 1955లో హిందూ వివాహ చట్టాన్ని, 1956లో హిందూ వారసత్వ, దత్తత, భరణం వంటి చట్టాలను తీసుకురాగలిగిందని తెలిపారు. అంబేద్కర్ చేసిన ఈ చారిత్రాత్మక త్యాగం, విలువలతో కూడిన రాజకీయ ప్రస్థానాన్ని నేటి తరానికి అందించాల్సిన అవసరం ఉందని చెప్పారు. ఈ మేరకు రాబోయే అసెంబ్లీ సమావేశాల్లో రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరుతూ, హిందూ యాక్ట్ బిల్లు కోసం అంబేద్కర్ చేసిన పోరాటాన్ని, ఆయన రాజీనామా వెనుక ఉన్న ఉన్నత ఆశయాలను పాఠ్యాంశాల్లో చేర్చాలని విజ్ఞప్తి చేస్తానని ఆయన ప్రకటించారు. గన్నవరం ఏఎంసీ చైర్మన్ గూడవల్లి నరసింహా రావు, రాష్ట్ర మాల కార్పొరేషన్ డైరెక్టర్ దయాల రాజేశ్వర రావు, ఉంగుటూరు మండల టిడిపి అధ్యక్షులు కొలుసు రవీంద్ర, నియోజకవర్గ తెలుగు మహిళా అధ్యక్షురాలు మేడేపల్లి రమ, కుందేటి చంద్రశేఖర్, అట్లూరి రాంకిరణ్, దారం విజయ్, మోటూరు మురళి, జంగం మోహనరావు, తాటిపాముల నాగయ్య, అట్లూరి నాని, బోడపాటి రవి, మోదుగుమూడి సత్యనారాయణ, చల్లగుల్ల సందీప్, తిరువీధి నరేష్, జొన్నలగడ్డ సుధాకర్, నెక్కంటి శ్రీదేవి, జాస్తి రేణుక, కొండేటి వెంకటేశ్వరరావు, జాస్తి శ్రీధర్, కొమ్మారెడ్డి రాజేష్, పాలడుగు మల్లికార్జునరావు, జాస్తి మురళి, బుస్సే నాగప్రసాద్, నిమ్మకూరి మధు, సూరిబోయిన రాంబాబు, కొమ్ము మధుకుమార్, కనిగంటి మహేష్, తుమ్మల కిషోర్, కలపర్తి చింటు, పోతురాజు సురేష్, మున్నా రామకృష్ణ, ఉయ్యూరు వెంకటేశ్వర రెడ్డి, అట్లూరి శ్రీనివాసరావు, మొవ్వ వేణుగోపాల్, కంచర్ల సూర్య, మణిమాల వెంకట అప్పారావు, కొణతం పోతురాజు తదితరులు పాల్గొన్నారు.

# సెంట్రల్ యూనివర్సిటీలను ఎమ్మెల్యే, చైర్మన్ లతో సందర్శించిన ఎంపీ.





- స్థానికులకు ఉపాధి అవకాశాలు కల్పించాలని సూచన.
- భూములు త్యాగం చేసిన గ్రామస్తులకు అండగా ఉంటామని హామీ.

**సబ్బవరం, పెన్ సత్తా, ఏప్రిల్ 14:** మండలంలో ఉన్న ప్రముఖ కేంద్ర విద్యాసంస్థలు అయిన దామోదరం సంజీవయ్య లా యూనివర్సిటీ, మారిటైమ్ యూనివర్సిటీ, పెట్రోలియం యూనివర్సిటీలను రైల్వే స్టాండింగ్ కమిటీ చైర్మన్ అనకాపల్లి పార్లమెంట్ సభ్యులు డాక్టర్ సి.ఎం రమేష్ స్థానిక కూటమి నేతలతో కలిసి మంగళవారం సందర్శించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే పంచకర్ల రమేష్, తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ గండి బాబ్జి, సబ్బవరం మండలం ముఖ్య నాయకులు, వంగలి గ్రామ నాయకులు తో కలసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మూడు యూనివర్సిటీల యాజమాన్యాలతో సమావేశ మైన ఎంపీ డాక్టర్ సి.ఎం. రమేష్, స్థానిక యువతకు ప్రాధాన్యత ఇచ్చి ఉపాధి అవకాశాలు కల్పించాలని అధికారులను కోరారు. యూనివర్సిటీల స్థాపన కోసం భూములు త్యాగం చేసిన గ్రామస్తుల అభ్యున్నతికి తాము ఎల్లప్పుడూ అండగా ఉంటామని స్పష్టం చేశారు.
ముందుగా డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ 135 వ జయంతిని పురస్కరించు కొని దామోదరం సంజీవయ్య లా యూనివర్సిటీలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అంబేద్కర్ విగ్రహానికి ఘనంగా పూలమాలలు సమర్పించి నివాళు లర్పించారు. అనంతరం జరిగిన సమావేశంలో విద్యార్థులకు అంబేద్కర్ జీవిత గాథ, సామాజిక న్యాయం కోసం ఆయన చేసిన కృషి గురించి వివరించి ప్రేరణాత్మక ప్రసంగం చేశారు. తరువాత మారిటైమ్ యూనివర్సిటీలో యూనివర్సిటీ అభివృద్ధి పనులు, మౌలిక వసతులు మరియు స్థానిక సమస్యల పై సమీక్ష నిర్వహించారు. విద్యార్థులు, సిబ్బంది ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అనంతరం పెట్రోలియం యూనివర్సిటీలో కూడా సందర్శించి, జరుగుతున్న నిర్మాణ పనుల పురోగతిని పరిశీలించారు. స్థానిక కూటమి నాయకులు, గ్రామస్తులతో కలిసి అధికారులతో చర్చించి, పెండింగ్‌లో ఉన్న పనులను వేగవంతం చేయాలని సూచించారు. ఈ సందర్శనల ద్వారా ప్రాంతీయ అభివృద్ధి, విద్యాసంస్థల పురోగతి మరియు స్థానిక సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి పెట్టినట్లు పేర్కొన్నారు.



# అగ్నిప్రమాదాల నివారణ పై ప్రజల్లో అవగాహన అత్యవసరం.

- జీవీఎంసీలో జాతీయ అగ్నిమాపక దినోత్సవం నిర్వహణ.
- పోస్టర్ , కరపత్రం ఆవిష్కరణ.
- సేఫ్ స్కూల్, సేఫ్ హాస్పిటల్ ❘ ఫైర్ సేఫ్టీ సొసైటీ లక్ష్యంగా కార్యక్రమాలు.
- జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్.

**విశాఖపట్నం, పెన్ సత్తా, ఏప్రిల్ 14:** జీవీఎంసీ పరిధిలో అగ్నిప్రమాదాల నివారణ పై ప్రజల్లో అవగాహన అత్యవసరమని, సేఫ్ స్కూల్, సేఫ్ హాస్పిటల్ ❘ ఫైర్ సేఫ్టీ సొసైటీ లక్ష్యంగా కార్యక్రమాలు చేపట్టామని, సంబంధిత పోస్టర్లను, కరపత్రాలను అన్ని సచివాలయాలకు సరఫరా చేసి ప్రజల్లో అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ పేర్కొన్నారు. మంగళవారం ఆయన మహా విశాఖపట్నం నగర పాలక సంస్థ ఫైర్ ప్రివెన్షన్ వింగ్ ఆధ్వర్యంలో జీవీఎంసీ ప్రధాన కార్యాలయం సమావేశ మందిరంలో జీవీఎంసీ అదనపు కమిషనర్లు పీఎం.సత్యవేణి ,డి.వి. రమణమూర్తి ఎస్ .ఎస్.వర్మ ,పి నల్లనయ్య, జోనల్ కమిషనర్ బి రాము , రీజనల్ ఫైర్ ఆఫీసర్ సిహెచ్. కృపావరం లతో కలిసి జాతీయ అగ్నిమాపక దినోత్సవ కార్యక్రమం నిర్వహించి, అగ్నిప్రమాదాల నివారణ పై అవగాహన కల్పించే పోస్టర్‌ను, కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ అగ్నిప్రమాదాల నివారణలో ప్రజల అప్రమత్తత కీలకమని తెలిపారు. సేఫ్ స్కూల్, సేఫ్ హాస్పిటల్ ❘ ఫైర్ సేఫ్టీ సొసైటీ లక్ష్యంతో ప్రతి పౌరుడు ఫైర్ సేఫ్టీ నియమాలను పాటించాలని సూచించారు. ఇంటి వద్ద గ్యాస్ సిలిండర్లు, విద్యుత్ పరికరాలను జాగ్రత్తగా వినియోగించు కోవాలని, షార్ట్ సర్క్యూట్, గ్యాస్ లీకేజ్ వంటి ప్రమాదాలను ముందుగానే నివారించాల్సిన అవసరం ఉందన్నారు. పాఠశాలలు, ఆసుపత్రులు, వాణిజ్య సముదాయాలలో ఫైర్ సేఫ్టీ ప్రమాణాలను కచ్చితంగా అమలు చేయాలని అధికారులకు సూచించారు.
అగ్నిప్రమాదాల సమయంలో భయపడకుండా వెంటనే ఫైర్ సర్వీసులను సంప్రదించాలని, పిల్లలు, వృద్ధులకు అత్యవసర పరిస్థితుల్లో తీసుకోవాల్సిన చర్యల పై అవగాహన కల్పించాలని తెలిపారు. అగ్నిప్రమాదాల నివారణలో ప్రజల సహకారం అత్యంత అవసరమని, ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించి నగరాన్ని సురక్షితంగా ఉంచాలని కమిషనర్ పిలుపునిచ్చారు.
అగ్నిప్రమాదాల నివారణ పై అవగాహన కల్పించే పోస్టర్‌ను, కరపత్రాలను అన్ని సచివాలయాలకు సరఫరా చేసి వార్డు కార్యదర్శులు ద్వారా ప్రజలకు అగ్ని ప్రమాదాలకు సంబంధించి తీసుకోవాల్సిన జాగ్రత్తల పై అవగాహన



పరచాలని రీజనల్ ఫైర్ ఆఫీసర్ సిహెచ్ కృపావరం కు కమిషనర్ ఆదేశించారు. విశాఖ నగరంలో జీవీఎంసీ జోనల్ వ్యవస్థ మరింత విస్తరించిన నేపథ్యంలో 2009లో జీవీఎంసీ నందు ఏర్పాటు చేసిన ఫైర్ విభాగాన్ని మరింత పటిష్ట పరచుకోవాల్సిన అవసరం ఉందని, ప్రత్యేకంగా ఒక ఫైర్ స్టేషన్ బ్రిగేడు ను ఏర్పాటు చేసుకునేందుకు ప్రతిపాదన సిద్ధం చేయాలని ,అగ్నిమాపక సేవలకు అవసరమగు పరికరాలు, సరంజామా, ఇన్ఫ్రాస్ట్రక్చర్ ఏర్పాటు చేసేందుకు తగిన చర్యలు చేపట్టాలని రీజనల్ ఫైర్ ఆఫీసర్ కు సూచించారు. ఈ కార్యక్రమంలో జీవీఎంసీ అధికారులు, ఉద్యోగులు, ఫైర్ ప్రివెన్షన్ వింగ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# అంబేద్కర్ లేని భారతదేశాన్ని ఊహించలేం.

- ఆయన రచించిన రాజ్యాంగం, సూచించిన మార్గం రెండు విలువైనవే.
- అంబేద్కర్ జయంతి సందర్భంగా పరిటాల శ్రీరామ్.
- హైదరాబాద్ లోని నివాసంలో అంబేద్కర్ జయంతి కార్యక్రమం.





**ధర్మవరం, పెన్ సత్తా, ఏప్రిల్ 14:**అంబేద్కర్ లేని భారతదేశాన్ని ఎప్పటికీ ఊహించలేమని ధర్మవరం నియోజకవర్గ టీడీపీ ఇన్ ఛార్జి పరిటాల శ్రీరామ్ అన్నారు. హైదరాబాద్ లోని తన నివాసంలో అంబేద్కర్ 135 వ జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. ఈ సందర్భంగా శ్రీరామ్ మాట్లాడుతూ స్వాతంత్రం తర్వాత దేశంలో అనేక అసమానతలు ఉండేవని, అవి మన దేశ ప్రగతికి ఆటంకంగా మారాయన్నారు. అలాంటి సమయంలో దేశాన్ని ఎలా నడిపించాలో మార్గం చూపించాలన్న బాధ్యత అంబేద్కర్ పై పెట్టారన్నారు. ఒక పేద కుటుంబంలో పుట్టి, అప్పటికే ఎన్నో అవమానాలు ఎదుర్కొని, ఉన్నత చదువులు చదివిన అంబేద్కర్ రాజ్యాంగం అనే పవిత్ర మైన గ్రంథాన్ని దేశానికి అందించారన్నారు. ఆయన రచించిన రాజ్యాంగం, అప్పుడు దేశానికి సూచించిన మార్గం రెండూ ఎంతో విలువైనవన్నారు. వాటి వలనే నేటికీ భారతదేశం సమైక్యతకు ప్రతిరూపంగా ఉందని శ్రీరామ్ అన్నారు. ఆ తర్వాత ఎంత మంది పాలకులు వచ్చినా అంబేద్కర్ నే స్ఫూర్తిగా తీసుకుని ముందుకు వెళ్లారన్నారు. కూటమి ప్రభుత్వ పాలన కూడా అంబేద్కర్ ఆశయాలకనుగుణంగా సాగుతోందని శ్రీరామ్ అన్నారు.

## పీఎం సూర్యఘర్ యోజన ఉత్సవ్ కార్యక్రమంలో ఎంపీ.




**పెందుర్తి, పెన్ సత్తా, ఏప్రిల్ 14**: నియోజకవర్గం పాత సబ్బవరం ఎస్సీ కాలనీలో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మార్గదర్శకత్వంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంయుక్త ఆధ్వర్యంలో అమలు చేస్తున్న ప్రతిష్టాత్మక పీఎం సూర్యఘర్ ముఫ్తీ బిజిలీ జగజ్జీవన్ జ్యోతి యోజన పథకాన్ని రైల్వే స్టాండింగ్ కమిటీ చైర్మన్, అనకాపల్లి పార్లమెంట్ సభ్యులు డా. సి.ఎం. రమేష్, పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్, ఏపీ ఆయిల్ ఫెడరేషన్ కార్పొరేషన్ చైర్మన్ గండి బాబ్జి నియోజకవర్గ కూటమి నాయకులు తో కలసి ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ రూ.8,848 కోట్ల వ్యయంతో రాష్ట్ర వ్యాప్తంగా సోలార్ విద్యుత్ వినియోగాన్ని ప్రోత్సహిస్తూ ప్రతి ఇంటిని ఒక విద్యుత్ ఉత్పత్తి కేంద్రంగా మార్చే లక్ష్యంతో ఈ పథకం అమలు అవుతోందన్నారు. ఇందులో భాగంగా ఎస్సీ, ఎస్టీ కుటుంబాలకు 7.7 లక్షల ఉచిత సోలార్ కనెక్షన్లు అందజేస్తున్నామని, ప్రతి ఇంటి పై 2 కిలో వాట్ల సోలార్ ప్యానెల్స్ ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఈ సందర్భంగా ఎస్సీ కాలనీలో ఏర్పాటు చేసిన సోలార్ ప్యానెల్స్‌ను పరిశీలించిన ఎంపీ, స్థానిక ప్రజలతో మాట్లాడి పథకం ప్రయోజనాలను వివరించారు. దేశం లోని ప్రతి ఇంటికి స్వయం విద్యుత్ సాధన అనే ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ సంకల్పాన్ని సాకారం చేసే దిశగా ఈ పథకం విజయవంతంగా అమలు అవుతోందన్నారు. పీఎం సూర్యఘర్ పథకం అమలులో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ముందంజలో ఉండటం గర్వకారణమని పేర్కొన్నారు. కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, కూటమి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## అంబేద్కర్ జయంతి సందర్భంగా నివాళులు అర్పించిన ఎంపీ, పంచకర్ల

**పెందుర్తి, పెన్ సత్తా, ఏప్రిల్ 14:**భారత రాజ్యాంగ రూపకర్త, భారతరత్న డా బీఆర్ అంబేద్కర్ జయంతి సందర్భంగా పెందుర్తి నియోజకవర్గం లోని వివిధ ప్రాంతాల్లో స్థానిక శాసనసభ్యులు పంచకర్ల రమేష్, విశాఖ జిల్లా టీడీపీ అధ్యక్షులు, టీడీపీ ఇంచార్జి గండి బాబ్జీ, కూటమి నాయకులతో కలిసి బాబాసాహెబ్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళు లు అర్పించారు. బాబా సాహెబ్ అంబేద్కర్ కేవలం ఒక నాయకుడు కాదు, ఆయన ఒక ఉద్యమం, ఒక ఆలోచన, ఒక విప్లవం, సమాజం లోని ప్రతి మనిషి గౌరవంగా జీవించే రోజు వచ్చినప్పుడు అదే అంబేద్కర్ కి నిజమైన నివాళి అని వీరు అన్నారు.



## అంబేద్కర్ స్ఫూర్తి ఆశయాల బాటలో తెలుగుదేశం పార్టీ పయనిస్తుంది ప్రగడ



**యలమంచిలి, పెన్ సత్తా, ఏప్రిల్ 14:** మున్సిపాలిటీ పరిధి, దిమిలి రోడ్లో గల డా. బి ర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసిన నివాళు లర్పించిన ప్రగడ నాగేశ్వర రావు. అనంతరం అయన మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ నిర్మాణం లోనే అంబేద్కర్ ఆశయాల సాధన ఉందని, పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు నందమూరి తారక రామారావు బిఆర్ అంబేద్కర్ తనకు ఆదర్శం అనే చాటి చెప్పారన్నారు. సమాజమే దేవాలయం ప్రజలే దేవుళ్ళు అనే ఎన్టీఆర్ ప్రభోదం అంబేద్కర్ స్ఫూర్తినుండి వచ్చిందేనని, నేషనల్ ఫ్రంట్ చైర్మన్గా ఎన్టీఆర్ ఉన్నప్పుడే అంబేద్కర్ కి భారతరత్న అవార్డు ప్రకటించారని, పార్లమెంట్ హాల్లో డాక్టర్ అంబేద్కర్ విగ్రహం నెలకొల్పి గౌరవించారని అన్నారు. తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుండి ఎస్సీ, ఎస్టీ, బీసీ ముస్లిం మైనారిటీలకు రాజ్యాధికారం కోసం అంకిత భావంతో కృషి చేస్తుందని, కె ఆర్ నారాయణను రాష్ట్రపతిగా, బాలయోగి ని లోక్సభ స్పీకర్ గా, మహేందర్ నాథ్ ను ఆర్థిక శాఖ మంత్రిగా, కాకి మాధవరావును ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా, ప్రతిభ భారతి ని శాసనసభ స్పీకర్ గా నియమించడం జరిగిందన్నారు. జస్టిస్ పున్నయ్య కమీషన్ 42 సిఫార్సులను యధా విధంగా ఆమోదించారని, దేశంలోనే మొట్ట మొదటి సారిగా ఎస్సీ ఎస్టీ కమిషన్ ఏర్పాటు, దళిత ఉద్యోగులకు ప్రమోషన్లు, సక్రమంగా సప్లై నిధులు వినియోగం, దళిత కాలనీలో మౌలిక సౌకర్యాల కల్పన, సంక్షేమ హాస్టల్లో ఏర్పాటు, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ లాంటి అనేక చర్యలను చేపట్టిందని, రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సేవలు అందరికీ గుర్తుండేలా తెలుగుదేశం ప్రభుత్వం రాజధాని అమరావతిలో 125 అడుగుల విగ్రహం నిర్మాణం చేపట్టిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి, యాదవ కార్పొరేషన్ డైరెక్టర్ ధూళి రంగనాయకులు, పట్టణ అధ్యక్షులు గొర్లి శివన్నారాయణ మూర్తి, మండల అధ్యక్షులు ఇత్తంశెట్టి సన్యాసి నాయుడు, జిల్లా ఉపాధ్యక్షులు కొటారు సాంబశివరావు, జిల్లా అధికార ప్రతినిధి దాడి రమేష్, ఆడారి రమణబాబు, మాజీ కౌన్సిలర్ మజ్జి రామకృష్ణ,క్లస్టర్ ఇన్చార్జిలు బొద్దపు శ్రీనివాసరావు, కరణం రవికుమార్,దంట్ల వెంకటస్వామి,నమ్మి రమణ,దేవా నాగేంద్ర, కరెడ్ల మల్లికార్జున రావు,సేనాపతి తులసిరామ్ గొర్లి బాబురావు, భీసెట్టి చిన్నారావు,ఎద్దు శివ తదితరులు పాల్గొన్నారు.

## నూకాంబికను దర్శించుకున్న నాయకులు





**అనకాపల్లి, పెన్ సత్తా, ఏప్రిల్ 14:**ఉత్తరాంధ్ర ఇలవేల్పు, రాష్ట్ర పండుగ గుర్తింపు పొందిన, గవరపాలెంలో వెలిసిన నూకాంబిక అమ్మవారి దేవస్థానంలో కొత్త అమావాస్య రాష్ట్ర జాతర మహోత్సవ భాగంగా అమ్మవారిని దర్శించుకున్న నాయకులు. మంగళవారం మాజీ మంత్రి, శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ ఆధ్వర్యంలో పార్లమెంట్ సభ్యుడు సీఎం రమేష్, యలమంచిలి శాసనసభ్యులు సుందరపు విజయ్ కుమార్ దంపతులు, ఏపీ అర్బన్ ఫైనాన్స్ అండ్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ పీలా గోవిందు సత్యనారాయణ దంపతులు,
అమ్మవారికి దర్శించుకొని ప్రత్యేక పూజల నిర్వహించారు. వీరికి ఆలయం తరుపున అమ్మవారి చిత్రపటం, ప్రసాదం ఇచ్చి ఘనంగా సత్కరించారు. ముందుగా ఆలయ మర్యాదలతో పూర్ణకంభము, మేల తాళాలతో స్వాగతం పలికారు.
ఈ కార్యక్రమంలో దేవస్థానం చైర్మన్ పీలా నాగశ్రీను (గొల్ల బాబు), ఆలయ సహా కమిషనర్ యాళ్ళశ్రీధర్,
రాష్ట్ర గవర కార్పొరేషన్ చైర్మన్ మళ్ల సురేంద్ర, డీసీఎం ఎస్ చైర్మన్ బాలాజీ, రాష్ట్ర టిడిపి కార్యవర్గ కార్యదర్శి దాడి రత్నాకర్, బిజెపి జిల్లా అధ్యక్షులు ద్వారపురెడ్డి పరమేశ్వర రావు,
ఆలయ ధర్మకర్తలు సూరే సతీష్ కుమార్, దాడి రవికుమార్
పొలిమేర స్వాతి ఆనంద్ కుమార్, మారిశెట్టి శంకర్రావు, కాండ్రేగుల రాజారావు, మజ్జి జానకి శ్రీనివాసరావు,
కొడుకుల శ్రీకాంత్, వడ్డాది మంగ, కోనేటి సూర్యలక్ష్మి పైడిరాజు, యర్రవరపు సంతోషి కుమారి నాగేష్, తదితరులు పాల్గొన్నారు.

## డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ సిద్ధాంతాలను ప్రతి ఒక్కరు ఆచరించాలి.

జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్.

**అనకాపల్లి, పెన్ సత్తా, ఏప్రిల్ 14:** భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఏ ఒక్క సామాజిక వర్గానికి చెందిన వ్యక్తి కాదని, సమాజంలో అసమానతలు తొలగించడానికి ఎంతగానో కృషి చేశిన మహోన్నత వ్యక్తిని జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్ పేర్కొన్నారు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ 135 వ జయంతి సందర్భంగా మంగళవారం ఉదయం యలమంచిలి మండలం, కొక్కిరాపల్లి లో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకులం (బాలికల) పాఠశాల నందు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ జయంతోత్సవ కార్యక్రమాలు సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముందుగా జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్, జాయింట్ కలెక్టర్ శౌర్య మాన్ పటేల్, శాసనసభ్యులు బండారు సత్యనారాయణ మూర్తి, సుందరపు విజయ్ కుమార్, గవర కార్పొరేషన్ చైర్మన్ మళ్ళ సురేంద్ర లు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం జ్యోతి ప్రజ్వలన చేసి డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్ మాట్లాడుతూ
సమాజానికి మార్గదర్శకు లైన భారత రాజ్యాంగ రూపకర్త డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ఆలోచనలను, సిద్ధాంతాలను ప్రతి ఒక్కరు ఆచరణలో పెట్టాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు. అంబేద్కర్ ఒక మేధావి, బహుముఖ ప్రజ్ఞాశాలి, సామాజిక శాస్త్రవేత్త అని పేర్కొన్నారు. ఆయన చూపిన ప్రతిభ, నిబద్ధత నేటి యువతకు ఆదర్శప్రాయమని తెలిపారు. విద్య ద్వారానే అసమానతలు తొలగిపోతాయని నమ్మి, ఉన్నత మైన చదువులు చదువుకుని, అనేక కష్టాలు అనుభవించి మనకు రాజ్యాంగం రాయడానికి ఆయన చాలా రాజ్యాంగాలను ఉపాసన పట్టారన్నారు. మన భారతదేశంలో విభిన్న కులాలు, మతాలు, సంస్కృతులు ఉన్నాయని, వీటినన్నిటిని మేళవించి ఒక చక్కటి రాజ్యాంగం రాయడం వల్ల ఏలాంటి ఇబ్బందులు లేకుండా నేడు మనం జీవించగలుగుతున్నామని కలెక్టర్ తెలిపారు. తాను కూడా కష్టపడి చదువుకొని కలెక్టర్ ని కాగలిగానని, అదే విధంగా విద్యార్థులందరూ కష్టపడి చదువుకొని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు.
శాసనసభ్యులు బండార సత్యనారాయణ మూర్తి మాట్లాడుతూ
అంబేద్కర్ తన జీవితంలో ఎన్ని ఇబ్బందులు పడ్డారని, ఎన్నో కష్టాలు పడి చదువుకున్నారని, ఆయన పడినటువంటి బాధలు, కష్టాలు ఈ సమాజంలో ఎవరూ పడకూడదనీ భావించి ప్రపంచం లోనే అతి పెద్ద రాజ్యాంగాన్ని ఈ దేశానికి అందించినటువంటి మహానుభావుడన్నారు. మనందరం మన హక్కులు, విధులు సక్రమంగా ఏ ఇబ్బందులు లేకుండా చేయగలుగుతున్నామంటే దానికి డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ కారణమని వారి ఆశయాలని ముందుకు తీసుకెళ్లాల్సిన అవసరం ఉందన్నారు. సమాజంలో ఉన్న ప్రతి ఒక్కరు కూడా మరొకరికి చేయి అందించి ముందుకు తీసుకెళ్లాల్సినటువంటి అవసరం ఉందన్నారు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ను స్మరించుకోవడం అంటే మనల్ని మనం గౌరవించు కోవడమన్నారు.
శాసనసభ్యులు సుందరపు విజయ్ కుమార్ మాట్లాడుతూ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఒక సామాజిక వర్గానికి చెందిన వ్యక్తి కాదనీ దేశంలో పుట్టిన ప్రతి ఒక్కరు అంబేద్కర్ వారసులుగానే మనమందరం కూడా గుర్తు పెట్టు కోవాలన్నారు. సమాజానికి, దేశానికి చేసినటువంటి మంచి వల్ల ఈ దేశం ఎంత ముందుకు వెళ్ళిందో ప్రతి ఒక్కరు గుర్తుంచుకోవాలని, కష్టపడి చదువుకొని ఒక ఉన్నత స్థాయికి చేరుకుని వివిధ మతాలు, వివిధ సంస్కృతులు, వివిధ కులాలు, వివిధ జాతులు ఉన్నటువంటి భారతదేశానికి రాజ్యాంగాన్ని రచించిన మహానుభావుడిని కొనియాడారు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఆశయాలను ముందుకు తీసుకు వెళుతూ, కష్టపడి చదువుకొని ఉన్నత శిఖరాలకు విద్యార్థులు చేరుకోవాలని ఆకాంక్షించారు. ఎస్సీ కార్పొరేషన్ ద్వారా లబ్ధిదారులకు చేయూత. భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ జయంతిని పురస్కరించుకుని జిల్లా షెడ్యూల్డ్ కులాల సేవా సహకార సంస్థ (ఎస్సీ కార్పొరేషన్) ద్వారా ఎస్సీ సామాజిక వర్గాల ఆర్థిక అభ్యున్నతి కోసం జిల్లాలో కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న పీఎంఎజెఎవై పథకం కింద, స్వయం సహాయక సంఘాల మహిళలకు వారి జీవనోపాధిని మెరుగు పరుచు కోవడానికి, వ్యవసాయం, సేవా రంగం, సూక్ష్మ, చిన్న తరహా వ్యాపారాల కోసం ఒక్కొక్కరికి రూ. 50,000 రాయితీతో పాటు, యూనిట్ విలువ కనీసం రూ.1 లక్ష నుండి గరిష్టంగా రూ.3 లక్షల వరకు 83 మంది లబ్ధిదారులకు మొత్తం రూ. 1.00 కోటి నిధులను మంజూరు చేసి లబ్ధిదారులకు అందించారు.



















యువతకు నైపుణ్య శిక్షణ – భారీ వాహన డ్రైవింగ్. నిరుద్యోగ ఎస్సీ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించే లక్ష్యంతో ఎస్సీ కార్పొరేషన్, ఏపీఎస్ఆర్టీసీ సహకారంతో ప్రత్యేక శిక్షణా కార్యక్రమాల నిర్వహణలో భాగంగా జిల్లాకు చెందిన 11 మంది అభ్యర్థులకు ఏపీఎస్ఆర్టీసీ ద్వారా 40 రోజుల పాటు భారీ మోటార్ వాహన డ్రైవింగ్ లో శిక్షణ ఇప్పించి శిక్షణ పొందిన వారికి సర్టిఫికెట్లు మంజూరు చేశారు. చివరగా విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలతో ఆకట్టుకోగా, ప్రజా ప్రతినిధులు అధికారులు విద్యార్థులతో కలిసి మధ్యాహ్న విందు చేశారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ శౌర్య మాన్ పటేల్, గవర కార్పొరేషన్ చైర్మన్ మళ్ళ సురేంద్ర, సోషల్ వెల్ఫేర్ డిడి రామానందం, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ సత్య పద్మ, ఏపీఎస్ఆర్టీసీ డి పి టి ఓ ప్రవీణ్, డి సి ఓ గ్రేసీ, దళిత నాయకులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## విద్య, సేవ, సంకల్పంతో ముందుకు వెళుతున్న మంత్రి సత్య కుమార్ యాదవ్.

- విద్యార్థుల భవిష్యత్తుకు బలమైన పునాది -- 2098 సైకిళ్ల పంపిణీ.
- పేద విద్యార్థుల అభ్యాసానికి అండగా మంత్రి సత్యకుమార్ యాదవ్
- విద్యార్థుల కలలకు చక్రాలు, సంస్కృతి సేవా సమితి ఆధ్వర్యంలో మహా కార్యక్రమం.
- అంబేద్కర్ ఆశయాల దిశగా విద్యార్థులు నడవాలి మంత్రి.
- సంకల్పం ఉంటేనే ఏదైనా సాధ్యం మంత్రి సత్యకుమార్ యాదవ్
- ప్రతి ఇంట్లో చదువు వెలుగు నింపాలి, అదే మా లక్ష్యం మంత్రి సత్యకుమార్.
- చదువులో ముందుండండి... మీ వెంటే మేముంటాం మంత్రి సత్యకుమార్.
- చదువు, శ్రమ, పట్టుదల ఉంటే మీ విజయాన్ని ఎవరూ ఆపలేరు మంత్రి.








**ధర్మవరం, పెన్ సత్తా, ఏప్రిల్ 14:** ధర్మవరం నియోజకవర్గంలో విద్యార్థుల అభ్యాసాన్ని ప్రోత్సహిస్తూ, వారి భవిష్యత్కు బలమైన పునాది వేయాలనే దృఢ సంకల్పంతో సంస్కృతి సేవా సమితి ఆధ్వర్యంలో మంగళవారం ధర్మవరం మార్కెట్ యార్డ్లో రెండో విడత సైకిళ్ల పంపిణీ కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ, వైద్య విద్య శాఖామాత్యులు, ధర్మవరం శాసనసభ్యులు సత్యకుమార్ యాదవ్ స్వయంగా పాల్గొని విద్యార్థులతో ఆత్మీయంగా మమేకమై, వారి చేతుల మీదుగా సైకిళ్లను అందజేశారు.
నియోజకవర్గం లోని మొత్తం 35 ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పదో తరగతి విద్యార్థులకు 2,098 సైకిళ్లను అందించే కార్యక్రమాన్ని సంస్కృతి సేవా సమితి చేపట్టింది. ఇందులో భాగంగా మొదటి విడతలో ధర్మవరం పట్టణ పరిధి లోని 11 ప్రభుత్వ పాఠశాలలలో చదువుతున్న 1,098 మంది విద్యార్థులకు సైకిళ్లు పంపిణీ చేయగా, రెండో విడతలో ధర్మవరం రూరల్, బత్తలపల్లి, తాడిమర్రి, ముదిగుబ్బ మండలాల పరిధి లోని 24 ప్రభుత్వ పాఠశాలలలో చదువుతున్న 1,000 మంది విద్యార్థులకు సైకిళ్లు అందజేశారు.
ఈ సందర్భంగా మంత్రి సత్యకుమార్ యాదవ్ మాట్లాడుతూ భారత రాజ్యాంగ నిర్మాత, మహనీయుడు డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ జయంతి సందర్భంగా ఆయనకు ఘన నివాళులు అర్పించారు. అంబేద్కర్ చూపిన మార్గంలో నడుస్తూ, ఆయన ఆశయాలను కొనసాగించడం ప్రతి విద్యార్థి బాధ్యత అని సూచించారు. విద్య ద్వారానే వ్యక్తిగత అభివృద్ధితో పాటు సమాజ అభివృద్ధి సాధ్యమవుతుందని తెలిపారు. తాను కూడా పేద కుటుంబం నుంచి వచ్చి ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లోనే చదివిన విషయాన్ని గుర్తుచేసుకుంటూ, ఆర్థిక ఇబ్బందులు విద్యార్థుల అభ్యాసానికి అడ్డంకి కాకూడదనే ఉద్దేశంతో ఈ సైకిళ్ల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టినట్లు చెప్పారు. పదో తరగతి పూర్తి చేసిన విద్యార్థులు కాలేజీలకు సులభంగా వెళ్లేందుకు సైకిల్ ఎంతో ఉపయోగ పడుతుందని పేర్కొన్నారు. విద్యార్థులు వినోదం, మొబైల్ వినియోగం వంటి వాటికి పరిమితి విధించి, చదువు పై దృష్టి కేంద్రీకరించాలని సూచించారు. ఈ వయస్సులో చదువు ప్రధాన బాధ్యతగా తీసుకుని కృషి చేస్తేనే ఉన్నత స్థాయికి చేరుకోవచ్చని అన్నారు. ముఖ్యంగా అమ్మాయిలు విద్యలో ముందంజలో ఉండడం అభినందనీయమని పేర్కొన్నారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ మహిళా సాధికారతకు ప్రాధాన్యత ఇస్తూ చట్టసభల్లో 33% రిజర్వేషన్ కల్పించిన విషయాన్ని ప్రస్తావిస్తూ, మహిళలు కుటుంబం మాత్రమే కాక సమాజ నిర్మాణంలో కీలక పాత్ర పోషిస్తారని తెలిపారు. సంస్కృతి సేవా సమితి ద్వారా విద్యార్థుల కోసం అనేక సేవా కార్యక్రమాలు చేపడుతున్నామని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలు, హాస్టళ్లలో ఆర్ఓ ప్లాంట్లు ఏర్పాటు చేయడం, పేద విద్యార్థులకు పరీక్ష ఫీజులు చెల్లించడం వంటి చర్యలు చేపడుతున్నామని చెప్పారు. అదేవిధంగా సివిల్స్ పరీక్షలకు ఉచిత కోచింగ్ అందిస్తూ, ధర్మవరం నుంచి ఐఏఎస్, ఐపీఎస్ వంటి ఉన్నతాధికారులను తయారు చేయాలనే లక్ష్యంతో కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని వివరించారు. ఇక బ్యాంకింగ్, రైల్వే వంటి పోటీ పరీక్షలకు కూడా ఉచిత కోచింగ్ అందిస్తున్నామని, విద్య ద్వారా కుటుంబం మాత్రమే కాక సమాజం మొత్తం అభివృద్ధి చెందుతుందని పేర్కొన్నారు. విద్యతో పాటు క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాల్లో కూడా విద్యార్థులు రాణించాలనే ఉద్దేశంతో రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలు, సంక్రాంతి సంబరాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. కుల, వర్గ విభేదాలకు దూరంగా సమాజం ఐక్యంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.
ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు, సంస్కృతి సేవా సమితి సభ్యులు, విద్యార్థులు, తల్లిదండ్రులు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.
ఈ కార్యక్రమంలో సంస్కృతి సేవా సమితి కార్యదర్శి ఒంటెర్ శ్రీనివాస్ రెడ్డి, జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలక మధుసూదన్ రెడ్డి, ఎన్డీఏ కూటమి నాయకులు, నాలుగు మండలాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా 135 వ డా. బి.ఆర్. అంబేద్కర్ జయంతి వేడుకలు

**పరవాడ, పెన్ సత్తా, ఏప్రిల్ 14:** మండలం లోని వాడచీపురిపల్లి పంచాయతీ లో భారత రాజ్యాంగ నిర్మాత, మహానేత డా. బి.ఆర్. అంబేద్కర్ 135 వ జయంతి కార్యక్రమం. ఈ సందర్భంగా ఎస్.సి కాలనీ లో వాడచీపురుపల్లి ఎంపీటీసీ గెడ్డం పుష్ప చంద్రరావు, కమిటీ సభ్యులు ఆహ్వానం మేరకు ముఖ్య అతిథిగా హాజరైన వై.సి.పి రాష్ట్ర కార్యదర్శి, మాడుగుల నియోజకవర్గ పరిశీలికులు పయిల శ్రీనివాసరావు పాల్గొని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డాక్టర్ అంబేద్కర్ భారతదేశానికి రాజ్యాంగాన్ని అందించిన మహనీయుడు మాత్రమే కాకుండా, సమాజం లోని అణగారిన వర్గాల అభ్యున్నతికి తన జీవితాన్ని అంకితం చేసిన మహాత్ముడని కొనియాడారు. సామాజిక న్యాయం, సమానత్వం, హక్కుల పరి రక్షణ కోసం ఆయన చేసిన పోరాటం ప్రతి భారతీయుడికి ఆదర్శప్రాయమని అన్నారు. అంబేద్కర్ చూపిన మార్గంలో నడుస్తూ సమాజంలో సమాన హక్కులు, అవకాశాలు అందరికీ అందేలా కృషి చేయడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. అనంతరం జయంతి సందర్భంగా నిర్వహించిన క్రీడా పోటీల విజేతలకు పయిల శ్రీనివాసరావు చేతుల మీదుగా విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ పోటీల్లో గ్రామ యువత ఉత్సాహంగా పాల్గొనడం హర్షణీయమని ఆయన అభినందించారు. గ్రామ స్థాయిలో ఇలాంటి కార్యక్రమాలు యువతలో ఐక్యత, క్రీడా స్ఫూర్తి పెంపొందించడానికి దోహదపడతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో పరవాడ మండల వైస్ ఎంపీపీ లు బంధం నాగేశ్వర రావు, బూస అప్పలరాజు, మండల పార్టీ అధ్యక్షులు కోన రామారావు, పెందుర్తి నియోజకవర్గ స్టూడెంట్ వింగ్ ప్రెసిడెంట్ చరణ్ రాజ్, జిల్లా ప్రధాన కార్యదర్శి చుక్క రాము నాయుడు, మాజీ పి.ఏ.సి.ఎస్ చైర్మన్ బురద రాజు, వై.సి.పి నాయకులు బొంది అచ్చిబాబు, బండి ముత్యాలు, మసవరపు అప్పారావు, జమ్ముల అశోక్,శివలంక నరసింగరావు,శివలంక గౌతమ్, బల్ల రమణ, ఎస్.రమేష్, ఎం.రమేష్, ఎస్.సుధీర్, ఎస్.అప్పలరాజు, ఎస్.సీతయ్య, ఎన్. ఈశ్వరరావు, ఎన్. రవి, ఓ.అప్పారావు, ఎస్.లక్ష్మణ్, ఎస్.సన్నిబాబు ,యూత్ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.



# స్మార్ట్ కిచెన్లను వెంటనే రద్దుచేయాలి



ఘనంగా అంబేద్కర్ కి నివాళులర్పించిన సిఐటియు నాయకులు.

**పరవాడ, పెన్ సత్తా, ఏప్రిల్ 14:** మండల కేంద్ర మైన పరవాడ బాలికల హాస్టల్ లో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించి 135 వ జయంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. అనంతరం స్మార్ట్ కిచెన్ లకు మధ్యాహ్నం భోజనం పథకం అప్పగించవద్దని సిఐటియు ఆధ్వర్యంలో వినతి పత్రాన్ని అంబేద్కర్ విగ్రహానికి సమర్పించారు. ఈ సందర్భంగా సిఐటియు రాష్ట్ర కార్యదర్శి జి.కోటేశ్వర రావు మాట్లాడుతూ భారతదేశ ప్రజల హక్కుల కోసం తన జీవితాన్ని పూర్తిగా భారత రాజ్యాంగ నిర్మాణానికి ఉపయోగించిన మహోన్నత మైన వ్యక్తి డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ అన్నారు. భారత రాజ్యాంగంలో ఇచ్చిన హక్కుల కోసం నేడు కార్మికవర్గం పోరాడాలని పిలుపునిచ్చారు. కుల, మతాలకు అతీతంగా ప్రజలు ఉండాలి అని అంబేద్కర్ చెప్పారన్నారు. బోధించు, సమీకరించు, పోరాడు అని తెలిపిన అంబేద్కర్ స్ఫూర్తితో భారత కార్మిక వర్గం పోరాడాలని కోటేశ్వర రావు పిలుపునిచ్చారు. ప్రభుత్వాలు మధ్యాహ్నం భోజన పథకాన్ని స్వచ్ఛంద సంస్థలకు ఇచ్చే చర్యలు విడనాడాలని ఆయన డిమాండ్ చేశారు. సుమారు పాతికేళ్లుగా మధ్యాహ్నం భోజనం పథకంలో వేలాదిమంది మహిళలు పనిచేస్తున్నారు. వీరు అనేక ఏళ్ల పాటు పారితోష్కాలు ఇవ్వకపోయినా పనిసేశారు, అలాగే ముందస్తు పెట్టుబడి పెట్టి పిల్లలకు నాణ్య మైన ఆహారాన్ని వండి పెడుతున్నారు. డొక్కా సీతమ్మ వంటి పేరు పెట్టి నేడు పథకాన్ని ప్రైవేటు చేయడం ప్రభుత్వానికి ఎంతవరకు సమంజసమన్నారు. పేదపిల్లలకు పెట్టే ఆహారంపై, పథకాలపై ప్రభుత్వం నిర్లక్ష్య ధోరణి విడనాడాలన్నారు. స్మార్ట్ కిచెన్లకు ఇవ్వడాన్ని ఐక్యంగా ఎదుర్కోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గనిశెట్టి సత్యనారాయణ మధ్యాహ్నం భోజన పథకం కార్మిక సంఘం నాయకులు కె. విమల, దేవుడమ్మ, సన్యాసమ్మ, రమణమ్మ, ఈశ్వరమ్మ, తదితరులు పాల్గొన్నారు.

# జాతీయ రహదారిపై రోడ్డు ప్రమాదాలు అరికట్టాలి



**నక్కపల్లి, పెన్ సత్తా, ఏప్రిల్ 14:** జాతీయ రహదారిపై తరచూ జరిగే రోడ్డు ప్రమాదాలు అరికట్టాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.అప్పలరాజు,మండల కార్యదర్శి ఎం.రాజేష్ లు డిమాండ్ చేశారు. మంగళవారం సిపిఎం కార్యాలయంలో వారు మాట్లాడుతూ జాతీయ రహదారిపై రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయని వీటిని అరికట్టడానికి ప్రభుత్వం పటిష్టమైన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. అనకాపల్లి జిల్లా ఎలమంచిలి బైపాస్ జంక్షన్ నుండి పాయకరావుపేట తాండవ బ్రిడ్జి వరకు గల జాతీయ రహదారిపై నిరంతరం ప్రమాదాలు జరిగి అనేక మంది ప్రాణాలు కోల్పోతున్నారని, ఎంతో మంది తీవ్రంగా గాయాలు పాలౌతున్నారని వెంటనే ప్రభుత్వం యుద్ధ ప్రాతిపదికన ప్రమాదాలు నివారణకు పటిష్టమైన చర్యలు తీసుకోవాలని కోరారు, తరచు ప్రమాదాలు జరుగుతున్న ప్రాంతాల్లో వాహనాలు వేగం నియంత్రణ, స్టాపర్స్, జీబ్రా లైన్లు, సిగ్నల్ లైట్లు ఏర్పాటు చేయాలని, నక్కపల్లి ఆర్టీసీ కాంప్లెక్స్ జంక్షన్, ఉపమాక ఆర్చ్ జంక్షన్ లలో నిరంతరం ట్రాఫిక్ నియంత్రణకు పోలీసు కానిస్టేబుల్స్ ను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

జాతీయ రహదారిని అనుకొని ఉన్న 50 పడకల ప్రభుత్వ ఆసుపత్రిని అభివృద్ధి చేయాలని, ట్రామా కేర్ సెంటర్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఆసుపత్రిలో అంబులెన్స్ అందుబాటులో ఉండేవిధంగా చర్యలు తీసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు గొర్రల రమణ తదితరులు పాల్గొన్నారు.

# వాడవాడలా అంబేద్కర్ జయంతి వేడుకలు



**నక్కపల్లి, పెన్ సత్తా, ఏప్రిల్ 14:** భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ 135వ జయంతి వేడుకలు వాడవాడలా ఘనంగా జరిగాయి. మంగళవారం మండలంలో నక్కపల్లి, కాగిత, వేంపాడు, సీతంపాలెం, చినదొడ్డిగల్లు, ఉద్దండ పురం, దేవవరం, ఉపమాక తదితర గ్రామాల్లో అంబేద్కర్ జయంతి వేడుకలను సందడిగా నిర్వహించారు. నక్కపల్లి మండల పరిషత్ కార్యాలయం వద్ద ఎంపీడీవో చలపతిరావు, పరిపాలనాధికారి సీతారామరాజు, జడ్పిటిసి సభ్యులను గోసలకాసులమ్మ, ఎంపీపీ ఏనుగుపల్లి రత్నం, వైఎస్ఆర్ సీపీ రాష్ట్ర కార్యదర్శి వీసం రామకృష్ణ, వైస్ ఎంపీపీ వీసం నానాజీ, వెలగా ఈశ్వరరావు, గొర్ల గోవిందు, కొప్పిశెట్టి హరి జనసేన నాయకులు వెలగా సుధాకర్ తదితరులు అంబేద్కర్ విగ్రహానికి పూలమాలు వేసే నివాళు లర్పించారు. నక్కపల్లి లో టిడిపి నాయకులు కొప్పిశెట్టి వెంకటేష్, మీగడ సత్తిబాబు, కోసూరు శీను కాగితలో ప్రత్యేక అధికారి దెందుకూరి సీతారామరాజు, ఎంపీటీసీ సభ్యులు ఆకేటి గోవిందరావు, తాజా మాజీ సర్పంచ్



పోతంశెట్టి రాజేష్, పంచాయితీ కార్యదర్శి చిన్నం నాయుడు, స్థానిక నాయకులు, దళిత నాయకులు అంబేద్కర్ విగ్రహానికి గజమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పెద్దలు మాట్లాడుతూ అంబేద్కర్ ఆశయాలను ప్రతి ఒక్కరూ పాటించాలని అన్నారు. యావత్ భారతదేశం అంబేద్కర్ రచించిన రాజ్యాంగాన్ని అనుసరించి పరిపాలన సాగిస్తున్నారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా కాగితలో పెద్ద ఎత్తున అన్న సమారాధన నిర్వహించారు.

# నాదస్వర, డోలు విద్యార్థులకు లక్ష రూపాయల విలువైన సామగ్రి పంపిణీ





**సింహాచలం, పెన్ సత్తా, ఏప్రిల్ 14:** ఆధ్యాత్మికతతో పాటు కళలను ప్రోత్సహించడంలో భాగంగా, సింహాచలం దేవస్థానం ద్వారా నిర్వహించబడుతున్న నాదస్వర పాఠశాల విద్యార్థులకు మంగళవారం దేవస్థానం తరపున ప్రత్యేక వితరణ కార్యక్రమం నిర్వహించారు.

నాదస్వరం, డోలు అభ్యసిస్తున్న విద్యార్థుల సాధన కోసం సుమారు రూ. 1,00,000 (లక్ష రూపాయలు) విలువ గల వస్తువులను అందజేశారు. ఇందులో డోలు వాయిద్యానికి అత్యంత కీలక మైన ఆకులు, మూతలు ఉన్నాయి.

దేవస్థానం కార్యనిర్వహణాధికారి జె. వెంకట్రావు విద్యార్థులకు స్వయంగా ఈ సామగ్రిని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రాచీన కళలను కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరి పై ఉందని, విద్యార్థులు క్రమశిక్షణతో విద్యను అభ్యసించాలని కోరారు.

ఈ కార్యక్రమంలో సహాయ కార్యనిర్వహణాధికారి వి. రమణ మూర్తి, పర్యవేక్షణ అధికారి గాయత్రి, వేద పాఠశాల ప్రిన్సిపాల్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు. దేవస్థానం తీసుకున్న ఈ నిర్ణయం పట్ల విద్యార్థులు హర్షం వ్యక్తం చేసారు.

# అంబేద్కర్ జయంతి సందర్భంగా నివాళులు అర్పించిన పయిల



**పరవాడ, పెన్ సత్తా, ఏప్రిల్ 14:** మండలం లోని తాణాం గ్రామం ఎస్సీ కాలనీ లో డా. బి.ఆర్. అంబేద్కర్ 135 వ జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ పయిల జగన్నాధ రావు, కన్నూరు రమణ పాల్గొని అంబేద్కర్ విగ్రహానికి పూల మాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జగన్నాధ రావు మాట్లాడుతూ డాక్టర్ అంబేద్కర్ భారతదేశానికి రాజ్యాంగాన్ని అందించిన మహనీయుడు మాత్రమే కాకుండా, సమాజం లోని అణగారిన వర్గాల అభ్యున్నతికి తన జీవితాన్ని అంకితం చేసిన మహాత్ముడని కొనియాడారు. సామాజిక న్యాయం, సమానత్వం, హక్కుల పరి రక్షణ కోసం ఆయన చేసిన పోరాటం ప్రతి భారతీయుడికి ఆదర్శప్రాయమని అన్నారు. నేటి యువత అంబేద్కర్ చూపిన మార్గంలో నడుస్తూ సమాజంలో సమాన హక్కులు, అవకాశాలు అందరికీ అందేలా కృషి చేయడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ నాయకులు, కాలనీ సభ్యులు పాల్గొన్నారు.

# ఆయుర్వేదమే ఆరోగ్యానికి మేలు

గునిపూడిలో ఉచిత వైద్య శిబిరం




**నక్కపల్లి,పెన్ సత్తా ఏప్రిల్ 14 :** ఆయుర్వేద వైద్యమే ఆరోగ్యానికి మేలు చేస్తుందని వేంపాడు ఆయుర్వేద ఆసుపత్రి వైద్యులు కె.రఘు అన్నారు. మంగళవారం గునిపూడిలో ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దీర్ఘకాలిక వ్యాధుల నివారణతో పాటు, అనేక వ్యాధులు దరి చేరకుండా ఆయుర్వేద వైద్యం ఎంతో ఉపకరిస్తుందని, ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి ఆయర్వేద వైద్య సేవలు, కొన్ని రోగాలు రాకుండా ఎలా జాగ్రత్త పడవచ్చునో ఆయన వివరించారు. అనంతరం నిర్వహించిన వైద్య శిబిరంలో పలువురు రోగులను పరీక్షించి వారికి ఉచితంగా పలు రకాల మందులను అందజేశారు. కార్యక్రంలో మాజీ సర్పంచ్ అ యినంపూడి పేర్రాజు(బాబు), వేంపాడు పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు అయినంపూడి మణిరాజు, ఫార్మసిస్ట్ భీ శెట్టి రామకృష్ణ, యోగా (టీచర్లు )శిక్షకులు డి రాంబాబు, డీఎన్ వీ సాయి పాల్గొన్నారు.

# నూతన పోలీస్ స్టేషన్ భవనాలను ప్రారంభించిన స్పీకర్, హోం మంత్రి



ప్రజా భద్రతే ధ్యేయంగా ఆధునిక పోలీసింగ్.

**నర్సీపట్నం, పెన్ సత్తా, ఏప్రిల్ 14:** అనకాపల్లి జిల్లా, నర్సీపట్నం సబ్ డివిజన్ పరిధి లోని నాతవరం, కృష్ణదేవిపేట, గొలుగొండ మండలాల్లో నూతనంగా నిర్మించిన పోలీస్ స్టేషన్ భవనాలను ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్న పాత్రుడు హోంమంత్రి వంగలపూడి అనిత ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో విశాఖ రేంజ్ ఐజీ గోపీనాథ్ జట్టి, జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ప్రభుత్వం స్పెషల్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ స్కీం కింద ఒక్కో పోలీస్ స్టేషన్‌కు రూ. 2.5 కోట్ల చొప్పున నిధులు కేటాయించారు. ఆంధ్రప్రదేశ్ పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఈ భవనాలు నిర్మించబడ్డాయి. ఈ నూతన భవనాల్లో సిసిటివి కెమెరాలు, ఆధునిక కౌన్సిలింగ్ గదులు, మహిళా పోలీసులకు ప్రత్యేక విశ్రాంతి గదులు, బందోబస్తు విధుల కోసం వచ్చే సిబ్బందికి అవసర మైన అన్ని వసతులు కల్పించారు. కార్యక్రమంలో చింతకాయల అయ్యన్నపాత్రుడు మాట్లాడుతూ

ప్రభుత్వం ప్రజల భద్రతకు పెద్దపీట వేస్తూ పోలీస్ వ్యవస్థను ఆధునీకరిస్తోందని తెలిపారు. జిల్లా పోలీసులు గత రెండు సంవత్సరాలుగా ఎస్పీ నేతృత్వంలో బాగా పని చేస్తున్నారని తెలిపారు.

నాతవరం, గొలుగొండ ప్రాంతాల్లో గంజాయి అక్రమ రవాణా దారుల పై గట్టి నిఘా ఉంచాలని, ఎటువంటి సిఫార్సులకు తావులేకుండా కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసులను ఆదేశించారు. వంగలపూడి అనిత మాట్లాడుతూ రాష్ట్రాన్ని గంజాయి రహిత ఆంధ్రప్రదేశ్‌గా మార్చడమే మా సంకల్పం అని హోంమంత్రి ప్రకటించారు. యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, గంజాయి కేసుల్లో పట్టుబడితే కఠిన శిక్షలు తప్పవని, దీనివల్ల భవిష్యత్తు నాశనం అవుతుందని హెచ్చరించారు. ప్రజలకు సత్వర సేవలు అందించడమే లక్ష్యంగా మౌలిక సదుపాయాల కల్పన జరుగుతోందన్నారు. ??విశాఖ రేంజ్ ఐజీ మాట్లాడుతూ ఆధునిక భవనాల వల్ల సిబ్బంది పనితీరు మెరుగుపడుతుందని, ప్రజలకు వేగవంతమైన సేవలు అందుతాయని తెలిపారు. ?జిల్లా ఎస్పీ మాట్లాడుతూ ఈ భవనాల ద్వారా పోలీసింగ్ మరింత ప్రజా కేంద్రితంగా మారుతుందని, ప్రజల విశ్వాసాన్ని పెంపొందించడంలో ఇవి కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. ఈ సందర్భంగా నాతవరం ఎస్సీ కాలనీలో జరిగిన డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ 135 వ జయంతి వేడుకల్లో స్పీకర్, హోంమంత్రి, ఇతర అధికారులు పాల్గొని, ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో రమణ, అదనపు ఎస్పీ ఎల్.మోహన రావు, అనకాపల్లి సబ్ డివిజన్ డీఎస్పీ ఎం.శ్రావణి, నర్సీపట్నం డీఎస్పీ పి.శ్రీనివాసరావు, రూరల్ సీఐ ఎల్.రేవతమ్మ, ఎస్సైలు తారకేశ్వర రావు (నాతవరం), రిషికేశ్ రావు (కృష్ణదేవిపేట), రామారావు (గొలుగొండ), స్థానిక ప్రజాప్రతినిధులు మరియు పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

# బాబాసాహెబ్ ఆశయ సాధనే లక్ష్యం కావాలి : మంత్రి పొంగులేటి



**కల్లూరు పెన్ సత్తా, ఏప్రిల్ 14: :** భారత రాజ్యాంగ నిర్మాత, భారతరత్న డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ఆశయ సాధనే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం అంబేద్కర్ జయంతిని పురస్కరించుకుని కల్లూరు మండల కేంద్రంలోని మెయిన్ సెంటర్లో ఉన్న అంబేద్కర్ విగ్రహానికి ఆయన పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. సమాజంలోని అట్టడుగు వర్గాల అభ్యున్నతి కోసం అంబేద్కర్ చేసిన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. రాజ్యాంగం కల్పించిన హక్కుల ద్వారానే నేడు అణగారిన వర్గాలకు న్యాయం జరుగుతోందని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్ , జిల్లా కలెక్టర్ దురిశెట్టి అనుదీప్, స్థానిక ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, రాజకీయ నాయకులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# వనపర్తిలో ఘనంగా నిర్వహించిన డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ 135వ జయంతి వేడుకలు.



**వనపర్తి జిల్లా పెన్ సత్తా, ఏప్రిల్ 14:**
ప్రపంచ మేధావి, నవ భారత రాజ్యాంగ నిర్మాత, భారతరత్న డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ గారి 135వ జయంతి వేడుకలు వనపర్తి జిల్లా కేంద్రంలో ఘనంగా నిర్వహించబడ్డాయి. జిల్లా కేంద్రంలోని దాచ లక్ష్మయ్య కళ్యాణ మండపంలో షెడ్యూల్ కులాల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఆదర్శ సురభి, ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు జి. చిన్నారెడ్డి, తెలంగాణ రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేన రెడ్డి, ఆర్డీవోతో పాటు జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు ద్యారపోగు వెంకటేష్, విశ్వం బాబు, ఎడవల్లి వీరప్ప, మాదారి భోజరాజు, చిట్యాల వెంకటేష్, రామచందర్, చిన్నమ్మ తామస్, కమ్మర్ రహిమాన్ తదితరులు పాల్గొన్నారు.

అతిథులు డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం మహనీయుల జయంతి ఉత్సవ కమిటీ సభ్యులను శాలువాలతో సత్కరించి “దళిత రత్న” అవార్డు షీల్డ్‌లను అందజేశారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఆదర్శ సురభి మాట్లాడుతూ, సమానత్వం, స్వేచ్ఛ, సౌభ్రాతృత్వం వంటి మహత్తర విలువలను భారత రాజ్యాంగం ద్వారా అందించిన మహనీయుడు అంబేద్కర్ అని కొనియాడారు. ఆయన చూపిన మార్గం సమాజానికి ఎల్లప్పుడూ దిశానిర్దేశం చేస్తుందని తెలిపారు.

అంబేద్కర్ ఆశయాలకు అనుగుణంగా అందరికీ సమాన అవకాశాలు కల్పించే సమాజ నిర్మాణానికి మనమంతా కట్టుబడి పనిచేయాలని పిలుపునిచ్చారు. సామాజిక న్యాయం సాధనలో ప్రభుత్వం అంబేద్కర్ స్ఫూర్తితో ముందుకు సాగుతుందని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో మహనీయుల జయంతి ఉత్సవ కమిటీ అధ్యక్షుడు గంధం నాగరాజు, ఎమ్మార్వో, మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీనివాస్ గౌడ్, మున్సిపల్ వైస్ చైర్మన్ మధు గౌడ్, మున్సిపల్ కమిషనర్, కౌన్సిలర్లు, ప్రజా ప్రతినిధులు, వివిధ సంఘాల నాయకులు, అంబేద్కర్ సంఘాల నాయకులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, సర్పంచులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ జయంతి సందర్భంగా కేజీబీవీ లో అవగాహన కార్యక్రమం నిర్వహణ.

## న్యాయ వ్యవస్థ పై ప్రతి విద్యార్థిని విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలి.



**వలిగొండ మండలం పెన్ సత్తా, ఏప్రిల్ 14:** యాదాద్రి భువనగిరి జిల్లా, వలిగొండ మండలం, లోతుకుంట గ్రామంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో, మండల లీగల్ సర్వీసెస్ కమిటీ, రామన్నపేట ఆధ్వర్యంలో డా. బి.ఆర్. అంబేద్కర్ జయంతి సందర్భంగా అవగాహన కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టు న్యాయమూర్తి డి. సత్యయ్య ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఆయన తన ప్రసంగంలో డా. బి.ఆర్. అంబేద్కర్ చిరస్మరణీయ కృషి, సామాజిక మార్పు కోసం చేసిన పోరాటం, ముఖ్యంగా మహాద్ సత్యాగ్రహం వంటి చారిత్రక సంఘటనల ప్రాముఖ్యతను వివరించారు.

అదేవిధంగా భారత రాజ్యాంగంలో ఉన్న ముఖ్యమైన హక్కులు అయిన ఆర్టికల్ 14 (సమానత్వ హక్కు), ఆర్టికల్ 17 (అస్పృశ్యత నిర్మూలన), ఆర్టికల్ 21ఏ (విద్య హక్కు) గురించి విద్యార్థులకు సవివరంగా తెలియజేశారు. సమాజంలో సమానత్వం, సామాజిక న్యాయం స్థాపనలో రాజ్యాంగం కీలక పాత్ర పోషిస్తుందని వివరించారు.

చివరగా విద్యార్థులను ఉద్దేశించి, “మీ చదువు మీకు కేవలం హక్కులను మాత్రమే కాకుండా, వివేకాన్ని కూడా అందించాలి. రాజ్యాంగం మీ చేతిలో ఉన్న గొప్ప ఆయుధం. దానిని బాధ్యతగా వినియోగించండి. డా. బి.ఆర్. అంబేద్కర్ చూపిన మార్గంలో నడుస్తూ, ఈ దేశాన్ని ఉన్నత శిఖరాలకు తీసుకెళ్లండి” అని ప్రేరణాత్మకంగా సందేశం ఇచ్చారు. ఈ అంశాలన్నింటిని విద్యార్థులకు సమగ్రంగా వివరిస్తూ, వారికి చట్టాలపై అవగాహన కల్పించబడింది. ఈ సందర్భంగా ప్యానెల్ అడ్వకేట్ బి. డేవిడ్ మాట్లాడుతూ, లీగల్ సర్వీసెస్ అథారిటీ ద్వారా అందుతున్న ఉచిత న్యాయ సహాయం, మహిళల హక్కులు మరియు బాలికల రక్షణ చట్టాలపై వివరించారు. ఈ కార్యక్రమంలో కేజీబీవీ సిబ్బంది జ్యోతి, మాధవి, అనుష, శైలజ పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఈ అవగాహన కార్యక్రమం ద్వారా విద్యార్థినులు రాజ్యాంగ విలువలు, హక్కులు మరియు బాధ్యతలపై స్పష్టమైన అవగాహనను పొందారు.

# ఘనంగా భారతరత్న డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ జయంతి కార్యక్రమం.

**హనుమకొండ జిల్లా ధర్మసాగర్ మండలం పెన్ సత్తా, ఏప్రిల్ 14:** ధర్మసాగర్ మండల కేంద్రంలోని బస్టాండ్ సమీపంలో డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ విగ్రహం వద్ద ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి బొడ్డు శాంతి సాగర్ మాదిగ ఆధ్వర్యంలో డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ 135 వ జయంతి కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగినది,

ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా గంగారపు శ్రీనివాస్ మాదిగ రాష్ట్ర నాయకులు ఎం ఎస్ పి జిల్లా నాయకులు బొడ్డు శాంతి సాగర్ అధికార ప్రతినిధి, మాచర్ల జ్యోతి ఏలియా గ్రామా సర్పంచ్ డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించడం జరిగింది.

తదనంతరం గంగారపు శ్రీనివాస్ మాట్లాడుతు డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ రాజ్యాంగ రచన సమయంలో మహిళల కోసం హిందూ కొడు బిల్లును పార్లమెంట్ లో ప్రవేశ పెట్టాడు దాని ముఖ్య ఉద్దేశం మహిళలాకు పురుషులతో సమానంగా హక్కులు ఉండాలన్నారు.

ఆస్తి హక్కు, కులాంతర వివాహం హక్కు, విడాకులు తీసుకునే హక్కు, బాహు బర్యాల వ్యతిరేక హక్కు, పిల్లలను దత్తత తీసుకునే హక్కు , పిల్లల తల్లికి కూడా ఆస్తి పొందే హక్కు ఉండాలన్నారు,

అంబేద్కర్ ప్రతిపదించిన హిందూ కొడు బిల్లును పార్లమెంట్ లో సభ్యులు వ్యతికించారు ఎక్కువ సంఖ్యలో వారి మెజారిటీ ఉండటం వలన హిందూ కొడు బిల్లు అమలు కాకుండా అడ్డుకున్నారు అంతే కాకుండా వాటిలో మార్పులు చేయాలన్నారు,అందుకు గాను అంబేద్కర్ తన మొదటి న్యాయశాఖ మంత్రి పదవికి రాజీనామా చేశారు,బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికై అలుపెరుగని పోరాటం చేసిన యోధుడు సమసమాజ స్థాపనలో భవితరాలకు స్ఫూర్తి ప్రదాతగ నిలిచిన గొప్ప వ్యక్తి

కులవివక్షత నిర్ములనకు అహర్నిశలు పోరాడిన వ్యక్తి ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్లడం మన అందరి బాధ్యత అని అన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్నవారు

బొజ్జపల్లి సుభాష్ బీజేపీ రాష్ట్ర నాయకులు, కొట్టె లెనిన్ సీనియర్ జెర్నలిస్ట్, మాచర్ల రవి కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు, గుర్రపు ప్రసాద్ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు, నిమ్మ సుదర్శన్ రెడ్డి బిజెపి పార్టీ జిల్లా నాయకులు, బొడ్డు వాసుదేవ్ కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు, బొడ్డు ప్రదీప్ కుమార్ మార్కెట్ డైరెక్టర్ ఏనుమాముల, కూనూర్ రాజు కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు, బొడ్డు లెనిన్ పిఎసిఎస్ డైరెక్టర్, కొలిపాక రమేష్ కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు, మాచర్ల రవి కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు, బొడ్డు చిన్న ప్రభుదాస్ కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు, బొడ్డు రమణాకర్ బి ఆర్ఎస్ మండల నాయకులు, జాలిగాపు దుర్గయ్య కాంగ్రెస్ పార్టీ గ్రామా శాఖ అధ్యక్షులు, బైరాపాక కుమార్ బీజేపీ పార్టీ మండల అధ్యక్షులు, గాజుల సంపత్ కుమార్ బీజేపీ పార్టీ జిల్లా నాయకులు, పెరుమాండ్ల అంరేందర్ రెడ్డి బీజేపీ పార్టీ జిల్లా నాయకులు, పొడిశెట్టి ప్రతాప్ ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకులు, పుట్ట ప్రదీప్ కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు, గంగారపు శ్యామ్ కాంగ్రెస్ పార్టీ వార్డ్ మెంబెర్, చిలుక ప్రతిభ వార్డ్ మెంబెర్ సోంపెల్లి అన్వేష్ మాదిగ ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షులు, ఎండి షాంషుద్దీన్ ఎం ఎస్ పి మండల పార్టీ అధ్యక్షులు, పుట్ట ప్రశాంత్ ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకులు, చిలుక రాజు ఎమ్మార్పీఎస్ మండల ప్రధాన కార్యదర్శి, సింగారపు పవన్ ఎమ్మార్పీఎస్ మండల ఉపాధ్యక్షులు, గొల్లపల్లి అనిల్ ఎమ్మార్పీఎస్ మండల ఉపాధ్యక్షులు, మల్లెపెల్లి అనిల్ ఎమ్మార్పీఎస్ మల్లెపెల్లి అనిల్ ఎమ్మార్పీఎస్ మండల నాయకులు, గంకిడి వెంకట్ రెడ్డి బీజేపీ పార్టీ మండల నాయకులు, సాయం సందీప్ మండల జెనరల్ సెక్రటరీ, గాజ శ్యామ్ బీజేవైఎం మండల అధ్యక్షులు, అనిరుద్ కెనాధన్య ఓబీసీ మోర్చా, శివ ప్రసాద్ రెడ్డి బీజేపీ మండల జెనరల్ సెక్రటరీ, గుర్రాల శ్రీనివాస్ బీజేపీ మండల ఉపాధ్యక్షులు, మోరే రాజేందర్ బీజేపీ మండల ఉపాధ్యక్షులు, దుస్సా రాములు జిల్లా కిషన్ మోర్చా, శ్రీరాముల విజయ్ బీజేపీ మండల నాయకులు, మాచర్ల బాబు, తదితరులు పాల్గొన్నారు.

# రాజుపేటలో ఘనంగా అంబేద్కర్ జయంతి వేడుకలు



**కూసుమంచి పెన్ సత్తా, ఏప్రిల్ 14: :** ఖమ్మం జిల్లా కూసుమంచి మండలం రాజుపేట గ్రామంలో డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ గారి 135వ జయంతి వేడుకలు అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని అంబేద్కర్ విగ్రహానికి మరియు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. భారత రాజ్యాంగ నిర్మాత, భారతరత్న డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ జయంతిని పురస్కరించుకుని రాజపేట గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద మరియు ప్రధాన కూడలిలో వేడుకలు మిన్నంటాయి. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజాప్రతినిధులు, అధికారులు మరియు గ్రామ పెద్దలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. నివాళులర్పించిన ప్రముఖులు :

ఈ కార్యక్రమానికి గౌరవ సర్పంచ్ భానోత్ మహేష్ మరియు ఉప సర్పంచ్ సోలిపురం ప్రభాకర్ రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై, అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. దళితుల, వెనుకబడిన వర్గాల అభ్యున్నతికి అంబేద్కర్ చేసిన కృషి చిరస్మరణీయమని, ఆయన ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు.

ఈ వేడుకల్లో గ్రామ పంచాయతీ బృందం మరియు గ్రామ ప్రముఖులు ఉత్సాహంగా పాల్గొన్నారు. వార్డు సభ్యులు: రాజుల రాములు, షేక్ జానిమియా, కిన్నెర మహేష్, అబ్బనపూర్ లక్ష్మి, బానోత్ దేశిరం, కోట అశ్విని. అధికారులు, పంచాయతీ సెక్రెటరీ ముత్తారావు , గ్రామ పెద్దలు, కందాల కమలాకర్ రెడ్డి, తూముల శీను, షేక్ జానీ, కిన్నెర నర్సయ్య, సంద్ర వెంకన్న, సబు దర్గయ్య, ఉప్పల పేరయ్య. కార్యక్రమంలో గ్రామ యువకులు పెద్ద ఎత్తున పాల్గొని “జై భీమ్” నినాదాలతో హోరెత్తించారు. అనంతరం గ్రామంలో మిఠాయిలు పంపిణీ చేసి పండుగ వాతావరణంలో జయంతిని జరుపుకున్నారు.

# గునిపూడి మాజీ సర్పంచ్ కు ఘన సన్మానం



**నక్కపల్లి,పెన్ సత్తా ఏప్రిల్ 14 :** మండలంలోని గునిపూడి మాజీ సర్పంచ్ అయినంపూడి పేర్రాజు(బాబు) ను మంగళవారం ఆ గ్రామంలో దళిత సంక్షేమ సంఘం ప్రతినిధులు ఘనంగా సత్కరించారు. నాలుగుపర్యాయాలు సర్పంచ్, మూడు సార్లు ఉప సర్పంచ్ గా గ్రామాన్ని అభివృద్ధి పథంలో నడిపించారని, ఆయన సేవలు అమోఘమని సంఘ ప్రతినిధులు పిట్టా కృపానందం, గంటా నూకరాజు అభిప్రాయపడ్డారు. ఈ మేరకు దుశ్శాలువతో ఆయన్ని సత్కరించారు. దాదాపు నాలుగు దశాబ్దాలపాటు తమ గ్రామాభివృద్ధికి ఆయన ఎంతో అంకితభావంతో సేవ చేశారని, నేటి తరం నాయకులు ఈయన అడుగుజాడల్లో నడవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అయినంపూడి మని రాజు ఉన్నారు.

# అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించిన పగడాల నాగరాజు

**పెన్ సత్తా, ఏప్రిల్ 14:** డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ జయంతి సందర్భంగా ఖమ్మం నగరంలో బి.ఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో పలు ప్రాంతాల్లో ఘనంగా నివాళులర్పించారు. జడ్పీ సెంటర్ వద్ద డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి స్మరించుకున్నారు.

ప్రకాష్ నగర్ 28వ డివిజన్‌లోని ప్రొఫెసర్ జయశంకర్ పార్కు వద్ద అంబేద్కర్ విగ్రహానికి అంబేద్కర్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో నివాళులర్పించి సభ నిర్వహించారు. జహీర్‌పురా పంపింగ్ వెల్ రోడ్ సెంటర్‌లో అంబేద్కర్ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విగ్రహానికి నివాళులు అర్పించారు.సూరేపల్లి ఉపేందర్ ,కూచిపూడి కిషోర్ ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణి చేసారు. 31వ డివిజన్ పత్తి మార్కెట్ సెంటర్‌లో కిన్నెర నాగరాజు ఆధ్వర్యంలో జరిగిన ఉత్సవాల్లో పాల్గొని కేక్ కట్ చేసి ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. బోస్ బొమ్మ సెంటర్‌లో పోతురాజు బాల ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో మహిళలకు చీరలు పంపిణీ చేశారు.

RNI:APTEL/2023/87729
పెన్ సత్తా
ప్రశ్నించడం అందరి హక్కు...
PEN SATTA Telugu Daily

# ఎడిటోరియల్

## అవయవదానంపై అపోహలు తొలగాలి

నిత్యం రద్దీగా ఉండే హైదరాబాద్ మహానగరంలోని ప్రధాన రోడ్లపై నిర్దిష్ట 14 కి.మీ దూరంలోని ఆసుపత్రికి 22 నిమిషాల్లో చేరుకుని ఐదుగురు రోగుల ప్రాణాలను కాపాడిన సంఘటన ఇటీవల చోటుచేసుకుంది. రోడ్డు ప్రమాదాల్లో మరణిస్తున్నవారి అవయవాలను దానం చేస్తుడడం నిత్యం చదువుతూ ఉన్నాం. ఇలాంటి సంఘటనలు 'అవయవ దానం'కు ప్రాణం పోస్తూ స్ఫూర్తిగా నిలుస్తున్నాయి. చావుబతుకుల మధ్య కొట్టుమిట్టాడుతున్న ఓ మనిషికి, మరణించిన మనిషి ప్రాణంపోయడం మానవత్వానికి ఉన్న గొప్ప గుణంగా భావించాలి. మరణించిన మనిషి తాలూకూ అవయవాలను నిర్దిష్ట సమయంలో మరో మనిషికి అమర్చడంవల్ల ఓ కొత్త జీవితం అందుతుంది. మరణం అంచున ఉండేవారికి రెండవ జీవితాన్ని ప్రసాదించడం 'పునర్జన్మ'గానే భావించాలి. ఇటీవలికాలంలో దేశవ్యాప్తంగా అవయవ దానంపై కొంతసానుకూల వాతావరణం ఏర్పడుతోంది. 2013లో అవయవదాతల సంఖ్య 5 వేల లోపు ఉండగా, 2025లో నాలుగు రెట్లు పెరిగి 20 వేలకు చేరింది. దేశవ్యాప్తంగా పన్నెండు వందల కుటుంబాలు అవయవాలు దానం చేసి ఇతరుల జీవితాల్లో వెలుగులు నింపారు. అత్యధిక అవయవదానం చేసిన రాష్ట్రాల్లో తెలంగాణ రెండవ స్థానంలో నిలిచింది. ఇది జాతీయ సగటుకన్నా ఎక్కువ కావడం విశేషం. మధుమేహం, అధిక రక్తపోటు తదితర కారణాల వల్ల దేశవ్యాప్తంగా పెద్ద సంఖ్యలో కిడ్నీ, కాలేయం, గుండె తదితర వ్యాధులకు గురవుతున్న వారి సంఖ్య ప్రతి ఏటా పెరిగిపోతున్నాయి. సరిపడ అవయవాల లభ్యత లేనందువల్ల ఏటా అయిదు లక్షలమంది నిస్సహాయస్థితిలో ప్రాణాలు కోల్పోతున్నారు. మనిషి జీవించినప్పుడు రక్తదానంతో పాటు కిడ్నీ, కాలేయం, గర్భాశయం, గర్భధారణ కణజాలం దానం చేయవచ్చు. బ్రెయిన్‌డెడ్ అయితే మూత్రపిండాలు, కాలేయం, ఊపిరితిత్తులు, గుండె, గుండె కవాటాలు, పేగులు, క్లోమం, కార్నియా ఇతరులకు ఉపయోగపడుతాయి. గుండె ఆగి మరణించిన వారైతే కళ్లు, చర్మం, గుండె, కవాటాలు, ఎముకలు వంటి కణజాలాలు వంటి అవయవాలు మాత్రమే కాకుండా, మొత్తం శరీరాన్ని కూడా దానం చేయవచ్చు.

బ్రెయిన్ డెడ్‌గా నిర్ధారించిన వ్యక్తి నుంచి సేకరించిన అవయవాలను నిర్దేశిత సమయాల్లో అవసరమైన వారికి అమర్చాలి. ఆలస్యమైతే అవి పాడైపోయే ప్రమాదముంది. ఒక దాత ఎనిమిదిమంది ప్రాణాలను కాపాడటానికి ఆస్కారముంది. అలాగే సహజ మరణం చెందిన కొద్ది నిమిషాల్లో కళ్లు. కణజాలం (టిష్యూ) సేకరించవచ్చు. కానీ, ప్రజల్లో సరైన అవగాహన లేకపోవడం, అపోహల వల్ల అవయవదానం చేస్తున్నవారి సంఖ్య ఆశించినమేరకు పెరగడం లేదు. 2023లో పదివేల మంది మహిళలు జీవించి ఉండగానే అవయవదానం పత్రాలమీద సంతకం చేసినట్లు కేంద్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమశాఖ నివేదిక తెలిపింది. పురుషులతో పోల్చితే ఈ సంఖ్య దాదాపు రెట్టింపు. దేశవ్యాప్తంగా ఏటా రోడ్డు ప్రమాదాల్లో ఒకటిన్నర లక్షల మందికిపైగా మరణిస్తున్నారు. సంబంధిత కుటుంబాలకు నచ్చజెప్పి మృతుల్లో కొందరి అవయవాలను మార్పిడి చేసినా అభాగ్యులెందరికో కొత్త ఊపిరి అందుతుంది. కానీ, బ్రెయిన్‌డెడ్ కేసులను సత్వరం గుర్తించడంతోపాటు వారి కుటుంబ సభ్యులను ఒప్పించడంలో నిర్లక్ష్యం నెలకొంటోంది. అవయవ దానం చేసేందుకు ఎవరైనా ముందుకు రావచ్చు. 18 ఏళ్లు పైబడిన ప్రతి వ్యక్తి అవయవదానం కోసం తమ పేరును నమోదు చేసుకోవచ్చు. 18 ఏళ్లలోపు ఉండేవారు తమ అవయవాలను దానం చేయడానికి అతని తల్లిదండ్రులు లేదా సంరక్షకుల అనుమతి ఉండాలి. మరణానంతరం అవయవ దానం కోసం నమోదు చేసుకుంటే, ముందుగా ఆ వ్యక్తిని వైద్యులు తనిఖీ చేస్తారు. ఆ వ్యక్తికి ఉన్న అనారోగ్య సమస్యలను అంచనా వేసి ఏ అవయవాలను దానం చేయవచ్చో తెలియజేస్తారు. తీవ్ర ప్రమాదం లేదా ఏదైనా వ్యాధి కారణంగా కోమాలోకి వెళ్లి, మళ్లీ స్పృహలోకి రాలేని పరిస్థితిలో ఉన్న బాధితుడిని బ్రెయిన్‌డెడ్‌గా నిర్ధారిస్తారు. ఆసుపత్రిలో వెంటిలేటర్ సహాయంతో వారి గుండె ఇంకా కొట్టుకుంటూ, ఇతర ముఖ్య అవయవాలు మాత్రం కొన్ని గంటలపాటు పనిచేస్తూనే ఉంటాయి. వీటిని కుటుంబ సభ్యుల అనుమతితో సేకరించి, బ్లడ్‌గ్రూప్ తదితర అంశాలు సరిపోలిన వారికి నిర్దేశిత సమయంలో అమర్చుతారు.బ్రెయిన్‌డెడ్‌గా ధ్రువీకరించడానికి ఒకరి కంటే ఎక్కువ మంది వైద్యనిపుణులతో కూడిన బోర్డు అనుమతి తప్పనిసరిగా ఉండాలి. అవయవాల సేకరణ, నిల్వ, తరలింపు, వాణిజ్యపరంగా వాటి దుర్వినియోగం వంటివాటిని నియంత్రించడానికి 1994లో మానవ అవయవాలు, కణాల మార్పిడి చట్టం తీసుకువచ్చింది. 2011లో దీనికి సవరణలు చేశారు. అవయవాల సేకరణ, కేటాయింపు, తరలింపును జాతీయ అవయవ, కణజాల మార్పిడి సంస్థ (ఎన్‌ఒటిటిఒ) పర్యవేక్షిస్తోంది. తెలుగు రాష్ట్రాల్లో అవయవ దానానికి 'జీవన్‌దాన్' ఎంతగానో కృషి చేస్తోంది. మరికొన్ని స్వచ్ఛంద సంస్థలూ పాటుపడుతున్నాయి. మరణించిన వ్యక్తుల అవయవ దానాన్ని ప్రోత్సహించేందుకు 2019లో కేంద్రం ప్రత్యేక కార్యక్రమాన్ని చేపట్టింది. ఈమేరకు అవయవాల అందుబాటును పెంచాలనేది జాతీయ అవయవ మార్పిడి కార్యక్రమ ఉద్దేశం. జాతీయ, ప్రాంతీయ, రాష్ట్ర స్థాయి అవయవ, కణజాల మార్పిడి సంస్థలు అవయవాల సేకరణ, పంపిణీకి సంబంధించిన సమన్వయ బాధ్యతల్ని నిర్వర్తిస్తున్నాయి. అవయవాలను అత్యంత తక్కువ సమయంలో సురక్షితంగా అందించడమే దీని ప్రధాన లక్ష్యం. ఈమేరకు ప్రజలు వెబ్‌సైట్ ద్వారా అవయవ దానానికి 'ఎన్‌ఒటిటిఒ'ను తీసుకొచ్చింది. దాత నుంచి సేకరించే అవయవాలను గ్రహీత ఉండే ఆస్పత్రికి చేర్చే ప్రక్రియలో అంబులెన్సులకు ఎలాంటి అడ్డంకులు లేకుండా గ్రీన్‌కారిడార్ పేరిట ప్రత్యేక మార్గాన్ని కల్పించారు. అంతేకాకుండా 'ఒకే దేశం ఒకే విధానం' కార్యక్రమాన్ని తీసుకొచ్చింది. దీంతో భారతీయులంతా రాష్ట్రాలతో సంబంధం లేకుండా ఎక్కడైనా దరఖాస్తు చేసుకోవచ్చు. 65 ఏళ్ల గరిష్ట వయోపరిమితిని తొలగించడం వల్ల ఎవరైనా, ఎక్కడైనా గ్రహీతలుగా అర్హులే. ఈ నేపథ్యంలో అవయవ దానంపైన ప్రచారోద్యమం ముమ్మరంగా సాగాలి. ప్రాథమిక పాఠశాల స్థాయి నుంచే విదార్థులకు అవయవదానంపై అవగాహన కల్పించాలి. ఎవరికైనా అపోహలుంటే తొలగించాలి. సామాజిక మాధ్యమాలు, ఇతరత్రా వేదికల ద్వారా ప్రచారం పెంచాలి. ఇందుకోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేయాలి.

# ఆమ్లెట్ వేసేటప్పుడు ఈ తప్పులు చేయకండి



మధ్యాహ్న భోజనమైనా, ఉదయం అల్పాహారమైనా.. వేడి వేడి ఆమ్లెట్ ఉంటే ఆ మాజనే వేరు. బ్యాచిలర్స్ నుండి మహిళల వరకు అందరికీ ఇష్టమైన, అత్యంత వేగంగా తయారయ్యే వంటకం ఇది. అయితే తయారు చేయడం సులభమే కదా అని మనం చేసే కొన్ని అశ్రద్ధలు ఈ పోషకాహారాన్ని అనారోగ్యకరంగా మారుస్తాయని నిపుణులు హెచ్చరిస్తున్నారు. మనం రోజూ వేసుకునే ఆమ్లెట్‌ను మరింత రుచిగా, ఆరోగ్యంగా మార్చుకోవడానికి పాటించాల్సిన సూత్రాలు. ఉప్పు కలిపే విషయంలో జాగ్రత్త: మనం చేసే అతిపెద్ద పొరపాటు గుడ్లను గిలకొట్టే ప్రారంభంలోనే ఉప్పు కలపడం. ఇలా చేయడం వల్ల గుడ్డులోని ప్రోటీన్ నిర్మాణం దెబ్బతిని, అది తేమను త్వరగా కోల్పోతుంది. ఫలితంగా ఆమ్లెట్ మృదుత్వాన్ని కోల్పోయి రబ్బరులా లేదా మందంగా తయారవుతుంది. గుడ్డు మిశ్రమాన్ని పెనంపై పోయడానికి కొన్ని సెకన్ల ముందు మాత్రమే ఉప్పు కలపండి. దీనివల్ల ఆమ్లెట్ ఫ్లఫీగా వస్తుంది. కూరగాయలతోనే పోషకాలు: చాలామంది కేవలం గుడ్డును మాత్రమే పగలగొట్టి ఉప్పు, కారం వేసి ఆమ్లెట్ వేసుకుంటారు. కానీ ఇందులో పీచుపదార్థం లోపిస్తుంది. కేవలం గుడ్లను మాత్రమే తీసుకోవడం వల్ల కలిగే అసమతుల్యతను పోగొట్టాలంటే తప్పనిసరిగా కూరగాయలను చేర్చుకోవాలి. ఉల్లిపాయలు, టమోటాలు, పచ్చిమిరపకాయలతో పాటు పాలకూర, క్యాప్సికమ్ లేదా క్యారెట్ తురుమును కూడా వాడవచ్చు. పీచుపదార్థం ఎక్కువగా ఉండే కూరగాయలు చేర్చడం వల్ల జీర్ణక్రియ మెరుగుపడుతుంది. పచ్చిగా వద్దు: ఉల్లిపాయలు, పచ్చిమిరపకాయలను నేరుగా గుడ్డు మిశ్రమంలో వేసి పెనంపై పోస్తే, ఆ తక్కువ సమయంలో కూరగాయలు సరిగ్గా ఉడకవు. దీనివల్ల తింటున్నప్పుడు పచ్చి వాసన రావడమే కాకుండా రుచి తగ్గుతుంది. ముందుగా బాణలిలో కొద్దిగా నూనె లేదా వెన్న వేసి కూరగాయలను దోరగా వేయించాలి. అవి సగం ఉడికిన తర్వాత మాత్రమే సిద్ధం చేసుకున్న గుడ్డు మిశ్రమాన్ని అందులో కలపాలి. ఇలా చేయడం వల్ల కూరగాయల్లోని సహజమైన రుచి ఆమ్లెట్‌కు పడుతుంది. ఆమ్లెట్ లబ హాఫ్ బాయిల్: చాలామంది గుడ్డును పగలగొట్టి రెండు వైపులా కాల్చడాన్ని ఆమ్లెట్ అనుకుంటారు. సాంకేతికంగా ఇది ఆమ్లెట్ కాకపోయినప్పటికీ ఆరోగ్యకరమే. అయితే ఆమ్లెట్ అంటే అన్ని పదార్థాలను సమపాళ్లలో కలిపి ఒక పద్ధతి ప్రకారం వండటం. వండేటప్పుడు మరీ ఎక్కువ నూనె వాడకుండా, తక్కువ మంటపై కాల్చడం వల్ల గుడ్డులోని పోషకాలు ఆవిరి కాకుండా ఉంటాయి. చిన్న మార్పులే పెద్ద ఫలితాలను ఇస్తాయి. ఆమ్లెట్ తయారీలో మీరు ఈ జాగ్రత్తలు పాటిస్తే, అది కేవలం కడుపు నింపే ఆహారమే కాకుండా శరీరానికి అవసరమైన పూర్తిస్థాయి ప్రోటీన్లు, విటమిన్లు అందించే అద్భుతమైన ఆరోగ్య వనరుగా మారుతుంది.

# కొబ్బరి పాల అన్నం ఇలా చేయండి



కొబ్బరి పాల అన్నం మీరు వినే ఉంటారు దీని గురించి చెప్పాల్సిన అవసరం లేదు. ఈ రెసిపీ దక్షిణ భారత వంటల్లో చాలా ఫేమస్. ఇది టేస్టీ వంటకం కూడా. ముఖ్యంగా, కొబ్బరి పాలు దీనిలో వేయడం వలన ప్రత్యేకమైన రుచి వస్తుంది. కొబ్బరి పాల అన్నం గురించి ప్రత్యేకించి చెప్పాల్సిన అవసరం లేదు. ఈ రెసిపీ దక్షిణ భారత వంటల్లో చాలా ఫేమస్. ఇది రుచికరమైన వంటకం కూడా. ముఖ్యంగా, కొబ్బరి పాలు దీనిలో వేయడం వలన ప్రత్యేకమైన రుచి వస్తుంది. మీ ఇంట్లో ఉండే వాటితో ఈజీగా చేసుకోవచ్చు. కావాల్సిన పదార్థాలు: ఒక కప్పు బియ్యం, ఒక కప్పు కొబ్బరి పాలు, అర టేబుల్ స్పూన్ జీలకర్ర, నాలుగు లవంగాలు, 5 యాలకులు, దాల్చిన చెక్క, ఒక చిన్న ఉల్లిపాయ, పచ్చిమిర్చి, అల్లం వెల్లుల్లి పేస్ట్, నెయ్యి , నూనెను తీసుకోవాలి. ముందుగా బియ్యాన్నికడిగి 10 నిముషాల పాటు నానబెట్టాలి. ఆ తర్వాత ఒక పెద్ద పాత్రలో కొద్దిగా నూనె లేదా నెయ్యి వేడి చేసి కొద్దిగా యాలకులు, దాల్చిన చెక్క, జీలకర్ర, లవంగాలు కూడా వేయించి పచ్చి వాసన వచ్చే వరకు బాగా వేయించాలి. ఆ తర్వాత కరివేపాకు ఆకులు, రెండు పచ్చిమిర్చి, కట్ చేసిన ఉల్లిపాయలు వేసి గోల్డ్ రంగు వచ్చే వీటిని బాగా వేయించాలి. ఆ తర్వాత కొద్దిగా అల్లం వెల్లుల్లి పేస్ట్ వేసి బాగా వేయించాలి. ఆ తర్వాత బియ్యాన్ని కూడా వేసి కొద్దిసేపు ఉంచి గరిటెతో దానిని తిప్పాలి. ఆ తర్వాత కొబ్బరి పాలు, నీరు కూడా వేసి, రుచిగా సరిపడా ఉప్పు , ఒక స్పూన్ గరం మసాలా కూడా వేసి మిక్స్ అయ్యేలా కలపాలి. ఇప్పుడు మూత పెట్టి మీడియం మంటపై బాగా ఉడికించాలి. చివర్లో కొత్తిమీర వేసి వేడి వేడి తినడమే.

# లైఫ్ క్వాలిటీని పెంచుతున్న చిన్న చిన్న వెకేషన్లు




రోజువారీ పనులు, చదువు లేదా ఉద్యోగం నుంచి అప్పుడప్పుడు విరామం తీసుకుని నచ్చినట్లు గడపడాన్నే వెకేషన్ అంటారు. రిలాక్స్ అవడం, ప్రయాణం చేయడం, కుటుంబంతో టైమ్ స్పెండ్ చేయడం, ఇష్టమైన పనులు చేయడం ఇందులో ఇందులో భాగమే. ఇలా ఏదో ఒక పర్పస్ కోసం ఎక్కువసార్లు వెకేషన్ తీసుకునేవారు జీవితంలో ఎక్కువ సంతోషంగా ఉంటారని ఒక అధ్యయనం పేర్కొన్నది. వెల్‌నెస్ స్టడీలో భాగంగా 9 దేశాల్లో 12 వేలమందిని ప్రశ్నించిన నిపుణులు పలు ఇంట్రెస్టింగ్ విషయాలను వెల్లడించారు. అవేమిటో చూద్దామా!

ఫ్రెండ్స్‌తోనో, ఫ్యామిలీతోనో కలిసి వెకేషన్ ప్లాన్ చేయడం, ట్రిప్‌కి వెళ్లడం, దగ్గరలోని పర్యాటక ప్రాంతాలను సందర్శించడం ఇలా ప్రతీ ఒక్కటి ఏదో ఒక ప్రయోజనాన్ని కలిగిస్తుందని నిపుణులు అంటున్నారు. పైగా ఇలా వెకేషన్ తీసుకునే వాళ్లు, తీసుకోని వారితో పోలిస్తే జీవితంలో తక్కువ స్ట్రెస్, క్వాలిటీ స్లీప్, ఎక్కువ సంతృప్తి కలిగి ఉంటున్నారని కనుగొన్నారు. కేవలం కేవలం మూడు నుంచి నాలుగు రోజుల చిన్న బ్రేక్‌లు కూడా మానసిక స్థితిని మెరుగు పర్చడంలో, ప్రొడక్టివిటీ పెంచడంలో సహాయపడతాయని, వెకేషన్ నుంచి తిరిగి వచ్చాక ఆ ప్రభావం వారాల పాటు కొనసాగుతుందని గుర్తించారు.

ఇక వెకేషన్ తీసుకునే వారు తక్కువ ఒత్తిడిని ఎందుకు కలిగి ఉంటారంటే.. వెకేషన్లు మనసును పని నుంచి దూరం చేసి, కార్టిసాల్ (ాబితీవబబ ఫ్ణనీతీఎనీనివ) లెవెల్స్ తగ్గిస్తాయి. తరచూ చిన్న బ్రేక్‌లు తీసుకుంటే స్ట్రెస్ పేరుకుపోకుండా రెగ్యులర్‌గా రీసెట్ అవుతుంది. బర్న్ అవుట్ తగ్గుతుంది. ఒకే పెద్ద వెకేషన్

తర్వాత స్ట్రెస్ తిరిగి పెరిగే అవకాశం ఎక్కువ. వెకేషన్ సమయంలో రిలాక్స్ అయి, రొటీన్ మార్పు వల్ల నిద్ర నాణ్యత మెరుగుపడుతుంది. తరచూ బ్రేక్‌లు తీసుకుంటే ఈ ప్రయోజనం ఏడాది పొడవునా కొనసాగుతుందని అధ్యయనాలు పేర్కొంటున్నాయి. స్ట్రెస్ తగ్గడం వల్ల నిద్రలేమి సమస్యలు తగ్గి, మానసిక ప్రశాంతత చేకూరుతుంది. యాక్టివ్‌నెస్ పెరుగుతుంది. సాధారణ వ్యక్తులతో పోలిస్తే అప్పుడప్పుడూ వెకేషన్లకు వెళ్లేవారు జీవితంలో ఎక్కువ సంతృప్తిని పొందుతారు. కారణం కొత్త ప్రాంతాల సందర్శన, కొత్త అనుభవాలు ఆనందాన్ని కలిగిస్తాయి. ఇక ట్రిప్ రాబోతోందనే ఆశ కూడా హ్యాపీనెస్‌ను పెంచుతుంది. తరచూ చిన్న ట్రిప్‌లు తీసుకుంటే ఈ బూస్ట్ రిపీట్ అవుతుంది. మొత్తం జీవిత సంతృప్తి పెరుగుతుంది. అమెరికన్ సైకలాజికల్ అసోసియేషన్ (ంఖం) స్టడీస్ కూడా వెకేషన్లు ఈ విధమైన ప్రయోజనాలను కలిగిస్తాయని పేర్కొన్నది.

# ఆఫీసు పని ఒత్తిడితో సతమతమవుతున్నారా?



నేటి ఉరుకుల పరుగుల జీవితంలో ఆఫీసు డెడ్‌లైన్లు, మీటింగుల మధ్య ఒత్తిడికి గురవ్వడం సహజం. అయితే, ఈ ఒత్తిడి మీ ఆరోగ్యంపై ప్రభావం చూపకుండా ఉండాలంటే, పని మధ్యలో చిన్న విరామం తీసుకుని ఈ క్రింది 5 నిమిషాల రిలాక్సేషన్ టెక్నిక్స్‌ను ప్రయత్నించండి. కేవలం 5 నిమిషాల పాటు ఈ చిన్నపాటి కదలికలు చేయడం వల్ల పనిలో ఉత్సాహం, ఏకాగ్రత పెరుగుతాయని ఆరోగ్య నిపుణులు సూచిస్తున్నారు. శ్వాస వ్యాయామం: కళ్లు మూసుకుని నిటారుగా కూర్చోండి. ముక్కుతో గాలిని పీల్చుకుని 4 సెకన్ల పాటు ఆపి, నెమ్మదిగా వదలండి. ఇలా 5 సార్లు చేయడం వల్ల మీ నాడీ వ్యవస్థ ప్రశాంతపడుతుంది. తక్షణ ఉపశమనం లభిస్తుంది. కళ్లకు విశ్రాంతి: డిజిటల్ స్ట్రెయిన్ తగ్గించడానికి పామింగ్ పద్ధతి వాడండి. రెండు అరచేతులను ఒకదానికొకటి వేగంగా రుద్ది, ఆ వెచ్చదనాన్ని కళ్లపై ఉంచుకోండి. ఇది కళ్ల అలసటను తగ్గిస్తుంది. మెడ, భుజాల స్ట్రెచెస్: నిరంతరం కంప్యూటర్ స్క్రీన్ చూడటం వల్ల మెడ నొప్పులు వస్తాయి. నెమ్మదిగా తలను అటు ఇటు తిప్పడం, భుజాలను పైకి కిందకు కదిలించడం వల్ల రక్త ప్రసరణ మెరుగుపడి కండరాల నొప్పులు తగ్గుతాయి. సీటెడ్ ట్విస్ట్: కుర్చీలో కూర్చునే మీ శరీరాన్ని కుడి వైపుకు, ఆపై ఎడమ వైపుకు మెల్లగా తిప్పండి. ఇది వెన్నెముకకు మంచి వ్యాయామంలా పనిచేస్తుంది. వెన్నునొప్పి రాకుండా కాపాడుతుంది. నీరు తాగడం, నడక: ఒత్తిడిని తగ్గించడానికి హైడ్రేషన్ చాలా ముఖ్యం. ప్రతి గంటకు ఒకసారి గ్లాసు నీరు తాగండి. వీలైతే సీటు నుండి లేచి ఒక నిమిషం పాటు ఆఫీసులోనే అటు ఇటు నడవండి.

# చెన్నై.. మళ్లీ కొట్టింది

## కోల్‌కతాపై ఘనవిజయం

## నూర్ అహ్మద్ విజృంభణ



**హ్యాట్రిక్ ఓటములతో ఐపీఎల్-19ను పేలవంగా ఆరంభించిన చెన్నై సూపర్‌కింగ్స్.. కొంచెం ఆలస్యంగా జోరందుకుంది. గత మ్యాచ్‌లో ఢిల్లీ క్యాపిటల్స్‌ను మట్టికరిపించిన సీఎస్కే.. మంగళవారం కోల్‌కతా నైట్‌రైడర్స్‌పై అలవోకగా గెలిచింది. బ్యాటింగ్ కొంచెం కష్టంగా సాగిన చెపాక్ స్టేడియంలో బ్యాటర్ల సమష్టి ప్రదర్శనతో 192 పరుగులు చేసిన చెన్నై.. ప్రత్యర్థిని 160/7కే కట్టడి చేసింది. స్పిన్నర్ నూర్ అహ్మద్ కోల్‌కతా పతనాన్ని శాసించాడు. వర్షం వల్ల ఖాతాలో చేరిన ఒక్క పాయింట్ మినహాయిస్తే.. అయిదో మ్యాచ్‌లోనూ కేకేఆర్ సొంతంగా పాయింట్ సాధించలేకపోయింది.**

సొంతగడ్డపై చెన్నై అదరగొట్టింది. మంగళవారం ఏకపక్షంగా సాగిన మ్యాచ్‌లో ఆ జట్టు 32 పరుగుల తేడాతో కోల్‌కతాను ఓడించింది. మొదట సంజు శాంసన్ (48; 32 బంతుల్లో 4x4, 3x6), డెవాల్డ్ బ్రెవిస్ (41; 29 బంతుల్లో 4x4, 2x6), ఆయుష్ మాత్రే (39; 17 బంతుల్లో 6x4, 2x6) రాణించడంతో చెన్నై 5 వికెట్లకు 192 పరుగులు చేసింది. కోల్‌కతా బౌలర్లలో కార్తీక్ త్యాగి (2/35), సునీల్ నరైన్ (1/21) రాణించారు. అనంతరం నూర్ అహ్మద్ (3/21) విజృంభించడంతో కేకేఆర్ 7 వికెట్లకు 160 పరుగులే చేయగలిగింది. అన్షుల్ కాంబోజ్ (2/32), ఖలీల్ అహ్మద్ (1/24), అకీల్ హొసీన్ (1/26) కూడా చక్కగా బౌలింగ్ చేశారు. రమణ్‌దీప్ సింగ్ (35; 23 బంతుల్లో 4x4, 1x6) టాప్‌స్కోరర్. పోటీలోనే లేదు: ఈ ఐపీఎల్‌లో 200 పైచిలుకు లక్ష్యాలను కూడా అలవోకగా ఛేదించేస్తున్న నేపథ్యంలో 193 పరుగులను చెన్నై కాపాడుకోగలదా అనుకుంటే.. కోల్‌కతాను అసలు పోటీలో లేకుండా చేశారు ఆ జట్టు బౌలర్లు. మ్యాచ్ సాగేకొద్దీ నెమ్మదించిన చెపాక్ పిచ్‌పై కోల్‌కతా బ్యాటర్లు పరుగులు చేయడానికి ఆపసోపాలు పడ్డారు. ఎన్నో అంచనాల మధ్య ఈ సీజన్లో అడుగుపెట్టి వరుసగా విఫలమవుతున్న ఫిన్ అలెన్ (1) మరోసారి పేలవ ప్రదర్శన చేశాడు. కాంబోజ్ అతణ్ని ఔట్ చేసి చెన్నైకి శుభారంభాన్నిచ్చాడు. రహానె మూడో స్థానానికి దిగి, నరైన్ (24; 17 బంతుల్లో 2x4, 2x6)ను ఓపెనర్‌గా పంపగా.. అతను ఉన్నంతసేపు ధాటిగానే ఆడాడు. రహానె (28; 22 బంతుల్లో 2x6), రఘువంశీ (27; 19 బంతుల్లో 3x4, 1x6) ఇన్నింగ్స్‌కు స్థిరత్వం తెచ్చినా.. సాధించాల్సిన రన్‌రేట్‌ను అదుపులోకి తేలేకపోయారు. స్కోరు పెంచే ప్రయత్నంలో రఘువంశీ ఔటైపోయాడు. రహానె, గ్రీన్ (0)లను వరుస బంతుల్లో పెవిలియన్ చేర్చిన నూర్ అహ్మద్.. రింకు సింగ్ (6)ను కూడా ఔట్ చేసి కోల్‌కతాకు దారులు మూసేశాడు. రోమన్ పావెల్ (31; 22 బంతుల్లో 1x4, 2x6), రమణ్‌దీప్ పోరాడి తమ జట్టుకు కాస్త గౌరవప్రదంగా ఓడే అవకాశమిచ్చారు.

మెరిసిన ఆ ముగ్గురూ..: మొదట టాస్ ఓడి బ్యాటింగ్ చేసిన చెన్నైకి ఆశించిన ఆరంభం దక్కకపోయినా.. ముగింపులోనూ ఆ జట్టు పేలవంగా ఆడినా.. ప్రత్యర్థికి పెద్ద లక్ష్యాన్నే నిలపగలిగింది. జట్టులో అర్ధశతకం నమోదు కాకపోయినప్పటికీ.. సంజు శాంసన్, ఆయుష్ మాత్రే, డెవాల్డ్ బ్రెవిస్ సమయోచితంగా ఆడి జట్టుకు మెరుగైన స్కోరును సాధించి పెట్టారు. పేలవ ఫామ్‌ను కొనసాగిస్తూ కెప్టెన్ రుతురాజ్ (7) తక్కువ స్కోరుకే వెనుదిరిగినా.. గత మ్యాచ్ సెంచరీ హీరో సంజు, మరోసారి కీలక ఇన్నింగ్స్ ఆడాడు. తొలి ఓవర్లోనే మూడు ఫోర్లతో జోరందుకున్న అతను.. తర్వాత కూడా నిలకడగా బ్యాటింగ్ చేశాడు. మరో ఎండ్‌లో యువ బ్యాటర్ ఆయుష్ మాత్రే పవర్‌ప్లేను సద్వినియోగం చేసుకుంటూ చూడముచ్చటైన షాట్లతో అలరించాడు. దీంతో చెన్నై తొలి 6 ఓవర్లలోనే 72 పరుగులు రాబట్టింది. అయితే పవర్ ప్లే చివరి బంతికి మాత్రే ఔటైపోయాడు. తర్వాత సంజు, బ్రెవిస్ ఇన్నింగ్స్‌ను ముందుకు నడిపించారు. తన బౌలింగ్‌లో ఒక సిక్సర్ బాది 48 మీదికి వచ్చిన సంజును కార్తీక్ త్యాగి అద్భుతమైన బంతితో బౌల్డ్ చేయగా.. ఆపై బ్రెవిస్‌కు సర్ఫరాజ్ (23) తోడవడంతో సీఎస్కే పటిష్ఠ స్థితికి చేరుకుంది. కుదురుకున్నాక ఇద్దరూ భారీ షాట్లు ఆడడంతో 16 ఓవర్లకు స్కోరు 162కు చేరుకుంది. అయితే ఆఖరి 4 ఓవర్లలో వేగంగా ఆడలేకపోయిన చెన్నై 30 పరుగులే చేయగలిగింది. సర్ఫరాజ్, బ్రెవిస్ వరుస ఓవర్లలో వెనుదిరగ్గా.. నెమ్మదించిన పిచ్‌పై దూబె (13 నాటౌట్), ఒవర్టన్ (7 నాటౌట్) షాట్లు కొట్టలేకపోయారు.

# ఆయుష్ అదరహో..


**కొంతకాలంగా ఆ యువ షట్లర్ తన నిలకడైన ప్రదర్శనతో ఆకట్టుకుంటున్నాడు. మంచి భవిష్యత్తున్న వర్ధమాన ఆటగాడిగా భారత బ్యాడ్మింటన్ వర్గాల్లో గుర్తింపు తెచ్చుకున్నాడు. తాజాగా ఆసియా ఛాంపియన్‌షిప్స్‌లో ప్రదర్శనతో అతడి పేరు మార్మోగుతోంది. సెమీస్‌లో చక్కని ఎటాకింగ్ గేమ్‌తో ప్రపంచ నంబర్‌వన్ కున్లావుత్ వితిద్‌సర్న్‌కు షాకిచ్చిన ఆ కుర్రాడు ఆయుష్ శెట్టి. ఈ యువ సంచలనంపై ఇప్పుడు భారీ అంచనాలే ఉన్నాయి. భారత బ్యాడ్మింటన్ అభిమానుల దృష్టంతా అతడిపైనే.**



భారత బ్యాడ్మింటన్ వర్గాల్లో ఇప్పుడు చర్చంతా 20 ఏళ్ల ఆయుష్ గురించే. ఆసియా బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్స్‌లో గత 61 ఏళ్లలో ఫైనల్ చేరిన తొలి భారతీయుడిగా అతడు చరిత్ర సృష్టించాడు. ఫైనల్ చేరే క్రమంలో పలు సంచలనాలను సృష్టించాడు. వితిద్‌సర్న్, జోనాథన్ క్రిస్టీ, లి షి ఫెంగ్ వంటి ఆటగాళ్లను అతడు మట్టికరిపించాడు. చక్కని డ్రాప్స్, నెట్‌ప్లే, బలమైన స్మాష్‌లతో ఆకట్టుకున్నాడు. తన సంయమనం, వ్యూహాత్మక ఆట, దూకుడుతో తాను అగ్రశ్రేణి ఆటగాళ్ల కోవకు చెందుతానని చాటుకున్నాడు. ఫైనల్లో ఓడిపోయినా.. ప్రణయ్ (2018) తర్వాత ఆసియా బ్యాడ్మింటన్‌లో పోడియం ఫినిష్ చేసిన తొలి భారత షట్లర్‌గా ఆయుష్ ఘనత సాధించాడు.

వచ్చాడిలా..: కర్ణాటకలోని సనూర్‌కు చెందిన ఆయుష్.. ఎనిమిదేళ్ల వయసులో బ్యాడ్మింటన్ రాకెట్ అందుకున్నాడు. తండ్రే తొలి గురువు. పెరట్లోనే శిక్షణ. అది సరదాగానే. కానీ అతడిలో ప్రతిభను గుర్తించిన కుటుంబం మెరుగైన శిక్షణ కోసం బెంగళూరుకు మకాం మార్చింది. ప్రకాశ్ పదుకొనె బ్యాడ్మింటన్ అకాడమీలో నిపుణులైన కోచ్‌లు ఆయుష్ నైపుణ్యానికి సానపట్టారు. కదలికలు మెరుగుపరుచుకుని, దూకుడు పెంచుకున్న అతడు.. ఆటలో ఎంతో ఎదిగాడు. జూనియర్ స్థాయిలో సత్తాచాటాడు. 2021లో డెన్మార్క్ జూనియర్ ఇంటర్నేషనల్ టైటిల్‌ను గెలుచుకున్నాడు. 2023 ప్రపంచ జూనియర్ ఛాంపియన్‌షిప్స్‌లో కాంస్య పతకంతో మెరిశాడు. ఒడిశా మాస్టర్స్ సూపర్ 100 (2023), బహ్రెయిన్ ఇంటర్నేషనల్ ఛాలెంజ్ (2023), డచ్ ఓపెన్ (2024)లో ఫైనల్‌కు చేరుకున్నాడు. సీనియర్ స్థాయిలోనూ అదే జోరు కొనసాగిస్తూ రోజు రోజుకూ ఎదిగిపోతున్నాడు. అతడి కెరీర్‌కు మలుపు నిరుడు యుఎస్ ఓపెన్ టైటిల్ గెలవడమే. ఇప్పుడు ఆసియా బ్యాడ్మింటన్‌లో ముగ్గురు టాప్-10 ఆటగాళ్లను ఓడించడం అతడి ఆత్మవిశ్వాసాన్ని అమాంతం పెంచుతుందనడంలో సందేహం లేదు. తన వయసుకు మించిన పరిణతిని

ప్రదర్శిస్తూ ఒత్తిడిలోనూ ఎంతో సంయమనంగా ఆడే ఆయుష్.. భారత బ్యాడ్మింటన్ భవిష్యత్తుకు భరోసా ఇస్తున్నాడు. ప్రపంచ బ్యాడ్మింటన్ సమాఖ్య (బీడబ్ల్యూఎఫ్) తాజా ర్యాంకింగ్స్‌లో అతడు తొలిసారి టాప్-20కి దూసుకెళ్లాడు. మంగళవారం ప్రకటించిన ర్యాంకింగ్స్‌లో అతడు ఏడు స్థానాలు ఎగబాకి 18వ స్థానంలో నిలిచాడు. ఈ ఏడాది ఇంకా థామస్ కప్, స్వదేశంలో ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లో సత్తా చాటడానికి సిద్ధమవుతున్నాడు అయుష్.



# అత్యంత ధనవంతుల జాబితాలో సౌత్ లేడీ స్టార్స్.. హైయెస్ట్ ఎవరంటే?



సినీ ఇండ్రస్ట్రీ లో కథానాయికలు కేవలం గ్లామర్‌కే పరిమితం కాకుండా, బాక్సాఫీస్ వద్ద తమకంటూ ఒక ప్రత్యేక మార్కెట్‌ను సృష్టించుకున్నారు. సంపాదనలో కూడా హీరోలకు గట్టి పోటీనిస్తూ భారీ ఆస్తులను కూడబెడుతున్నారు. నయనతార నుంచి సమంత వరకు, రష్మిక మందన్న నుంచి త్రిష వరకు టాప్-7 ధనవంతులైన నటీమణుల జాబితా ఇప్పుడు సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారింది. మార్చి 2026 నాటి అంచనాల ప్రకారం వీరి నికర ఆస్తుల విలువ ఎంత వుందో తెలిస్తే ఆశ్చర్యపోతారు. మరి ఆ వివరాలు చూద్దాం..

**అగ్రస్థానంలో లేడీ సూపర్ స్టార్ నయనతార:**

సౌత్ ఇండియాలోనే అత్యంత ధనవంతురాలైన నటిగా నయనతార మొదటి స్థానంలో నిలిచారు. 41 ఏళ్ల ఈ 'లేడీ సూపర్ స్టార్' నికర ఆస్తి విలువ ప్రస్తుతం రూ. 200 కోట్లకు పైగానే ఉన్నట్లు సమాచారం. ఇక ఫోర్బ్స్ ఇండియా సెలబ్రిటీ లిస్టులో చోటు దక్కించుకున్న ఏకైక సౌత్ నటిగా ఆమె రికార్డు సృష్టించారు. ఆమె తర్వాత 'బాహుబలి' ఫేమ్ అనుష్క శెట్టి రూ. 135 కోట్లతో రెండో స్థానంలో ఉన్నారు. స్వీటీ ఒక్కో సినిమాకు రూ. 5 నుంచి 7 కోట్ల వరకు రెమ్యునరేషన్ తీసుకుంటూ తన హవా కొనసాగిస్తోంది.

**తమన్నా, సమంతల మధ్య గట్టి పోటీ:**

ఇక మిల్కీ బ్యూటీ తమన్నా భాటియా, స్టార్ బ్యూటీ సమంత రూత్ ప్రభు ఇద్దరూ దాదాపు సమానమైన ఆస్తులతో తర్వాతి స్థానాల్లో నిలిచారు. తమన్నా నికర ఆస్తి రూ. 110-120 కోట్లు ఉండగా, ఆమె ఒక్కో సినిమాకు రూ. 4 నుంచి 5 కోట్లు వసూలు చేస్తోంది. ఇక సమంత కూడా రూ. 110-120 కోట్ల ఆస్తులతో ఆమెకు గట్టి పోటీనిస్తోంది. సమంత క్రేజ్‌ను బట్టి ఒక్కో ప్రాజెక్టుకు రూ. 3 నుంచి 8 కోట్ల వరకు తీసుకుంటోంది. వీరిద్దరూ సినిమాలతో పాటు బ్రాండ్ ఎండార్స్‌మెంట్స్ ద్వారా కూడా భారీగా సంపాదిస్తున్నారు.

**సీనియర్ భామల సత్తా.. త్రిష, కాజల్:**

ఇక రెండు దశాబ్దాలుగా ఇండస్ట్రీలో కొనసాగుతున్న త్రిష కృష్ణన్, కాజల్ అగర్వాల్ కూడా ఈ జాబితాలో టాప్ లో ఉన్నారు. త్రిష ఆస్తుల విలువ రూ. 85 నుంచి 100 కోట్ల మధ్య ఉండవచ్చని అంచనా. ఇక 40 ఏళ్ల కాజల్ అగర్వాల్ కూడా తన టోటల్ కెరీర్‌లో రూ. 85 కోట్ల వరకు ఆస్తులను కూడబెట్టుకున్నారు. అప్పట్లో 'మగధీర' వంటి సినిమాలతో టాప్ రేంజ్‌కు వెళ్లిన కాజల్, పెళ్లయ్యాక కూడా మంచి ప్రాజెక్టులతో బిజీగా ఉంటూ తన ఆర్థిక స్థితిని పటిష్టంగా ఉంచుకున్నారు.

**నేషనల్ క్రష్ రష్మిక దూకుడు:**

ప్రస్తుతం పాన్-ఇండియా లెవల్లో ఫుల్ డిమాండ్ ఉన్న నటి రష్మిక మందన్న. కేవలం 29 ఏళ్ల వయసులోనే ఆమె రూ. 66 కోట్ల ఆస్తులను సంపాదించారు. 'పుష్ప 2' కోసం రూ. 10 కోట్లు, సల్మాన్ ఖాన్ 'సికిందర్' కోసం ఏకంగా రూ. 13 కోట్లు తీసుకున్నట్లు వార్తలు వస్తున్నాయి. ఇటీవల వివాహం చేసుకున్న రష్మిక, ఈ జాబితాలో అందరికంటే చిన్న వయసులోనే కోట్లకు పడగలెత్తిన నటిగా నిలిచింది. భవిష్యత్తులో ఆమె ఆస్తుల

విలువ ఇంకా పెరిగే అవకాశం స్పష్టంగా కనిపిస్తోంది.సౌత్ లేడీ స్టార్స్ తమ కష్టంతో మరియు టాలెంట్‌తో ఈ స్థాయికి చేరుకోవడం నిజంగా అభినందనీయం. కేవలం సినిమాలే కాకుండా వ్యాపార రంగంలో కూడా పెట్టుబడులు పెడుతూ తమ ఆర్థిక భవిష్యత్తును ప్లాన్ చేసుకుంటున్నారు. ఈ జాబితా చూస్తుంటే దక్షిణాది నటీమణుల స్టార్ పవర్ బాలీవుడ్ భామలకు ఏమాత్రం తీసిపోదని అర్థమవుతోంది.

PENSATTA TELUGU DAILY Printed, Published, Owned by CHITAMANENI ANIL KUMAR, D.NO 1-1, RAJULA ILLA PAKKANA, VENKATAPURAM, THANAM POST, MUNGAPAKA MANDAL, ANAKAPALLI VISHAKAPATNAM, ANDHRA PRADESH 531021 ,Publishe at D.NO 1-1, RAJULA ILLA PAKKANA, VENKATAPURAM, THANAM POST, MUNGAPAKA MANDAL, ANAKAPALLI VISHAKAPATNAM, ANDHRA PRADESH 531021 . And Printed at Chaitanya Vaaradhi printers, Do.No 2-99 Bharanikam, Paravada Anakapalli, Visakhapatnam- 531 021. Editor: CHITAMANENI ANIL KUMAR, D.NO 1-1, RAJULA ILLA PAKKANA, VENKATAPURAM, THANAM POST, MUNGAPAKA MANDAL, ANAKAPALLI VISHAKAPATNAM, ANDHRA PRADESH 531021 , Cell: 99853 15759, RNI. No APTEL/2023/87729, E-mail:anilchinthamneni@gmail.com